బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో..


# ఆలోచించండి!

తటవర్తి వీరరాఘవరావు



బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...

# ఆలోచించండి!



రచన & ప్రచురణ : **తటవర్తి వీరరాఘవరావు**


ప్రథమ ముద్రణ : మే, 2013
ప్రతులు : 3,000

ద్వితీయ ముద్రణ: అక్టోబరు, 2018
ప్రతులు : 1,000

తృతీయ ముద్రణ: ఫిబ్రవరి, 2021
ప్రతులు : 1,000


వెల : **రూ. 60/-లు**



పుస్తకముల కొరకు

**తటవర్తి వీర రాఘవరావు**

**తటవర్తివారి వీధి, భీమవరం - 534 201. ప॥గో॥జిల్లా.**
**ఫోన్ : 08816 - 234353, సెల్ : 9440309812**
email : balajipyramid.bvrm@gmail.com



# ధ్యానం చేసే పద్ధతి
# శ్వాసమీద ధ్యాస



ఎవరికి తగిన సుఖాసనంలో వారు హాయిగా కూర్చుని... చేతులు రెండూ కలిపి... కళ్ళు రెండూ మూసుకుని... ప్రకృతి సహజంగా జరుగుతున్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనిస్తూ వుండాలి!

మధ్యమధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పుడు 'కట్' చేస్తూ... మళ్ళీ, మళ్ళీ శ్వాస మీదకే... ధ్యాస మరల్చుతూ వుంటే.. క్రమ క్రమంగా... ఆలోచనా రహిత స్థితి కలుగుతుంది.... చిత్తవృత్తులు నిరోధించబడతాయి... మనస్సు నిర్విషయం, శూన్యం అయిపోతుంది. మనస్సు శాంతిస్తుంది. ఇదే ధ్యాన స్థితి.

ఈ ఆలోచనా రహిత స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీ మండల, ఆత్మానుభవాలను గమనిస్తూ వుండాలి. ఆ స్థితిలో విశ్వమయ ప్రాణశక్తి. అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీ మండలాన్ని శుద్ధి చేస్తుంది. ఆ శక్తి వల్ల రోగాలన్నీ తగ్గుతాయి. నాడీమండల శుద్ధి వల్ల కర్మలు పోతాయి.

ప్రతిరోజూ ఎవరి వయస్సు ఎంతుంటుందో... కనీసం అన్ని నిమిషాలు... తప్పనిసరిగా... రోజుకి రెండు సార్లుగా... ధ్యానం చెయ్యాలి.




బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

## ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం

*భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన* ***ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం*** *నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.*

**ప్రవేశం** : *మూడురోజులకు భోజనం, వసతి ఉచితం*

**వేదిక** : *శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.*

వివరాలకు : **తటవర్తి వీరరాఘవరావు,** తటవర్తి వారి వీధి, **భీమవరం - 534 201.**
సెల్ : 94403 09812, 94901 71853

# ఆలోచించండి

లోకంలో ఎవరిని చూసినా, ఎక్కడ చూసినా ముఖ్యంగా రెండు విషయాలకు ప్రాముఖ్యం ఇస్తున్నారు. అవి ఏమిటంటే (1) సంపాదించడం, (2) అనుభవించడం ఇంతకు తప్ప వేరే ఆలోచన లేదు.

అంటే ఎంతసేపూ ఎలా సంపాదించాలి? ఎంత ఎక్కువ సంపాదించాలి? అన్న దానికే ప్రాముఖ్యం ఇస్తున్నారు. తరువాత సంపాదించిన దానితో ఎలా అనుభవించాలి? ఎన్ని రకాలుగా అనుభవించాలి? అన్న విషయాలకే ప్రాముఖ్యం ఇస్తున్నారు. అందుకే రోజులో ఎక్కువ సమయం సంపాదించడానికి కేటాయిస్తున్నారు. ఏ మాత్రం కాళీ దొరికినా జీవితాన్ని ఎంజాయ్ చేయడానికి చూస్తున్నారు. ఇంచుమించు అందరి పరిస్థితి ఇలాగే వుంది.

మరి మానవ జీవితంలో అంతకన్నా ఆలోచించవలసింది లేదా? అంటే తప్పనిసరిగా ఆలోచించవలసింది వుంది. ఒక రకంగా చెప్పాలంటే ఆలోచించ వలసిన విషయాలు ఎన్నో వున్నాయి. అవన్నీ ఆలోచించకపోవడం వల్లే మానవ జీవితంలో ఇంత దుఃఖం తాండవిస్తోంది. అంటే ఇంచుమించు అందరి జీవితాల్లో దుఃఖం కనిపిస్తుంది. అంటే ఒక రకంగా సమస్యలు లేనివారే కనిపించరు. ఏదో కొంతకాలం జీవితం బాగున్నట్లు కనిపించినా... మరల ఏదో ఒక సమస్యలో చిక్కుకుంటున్నారు.

అలా చూస్తే కొంతమంది.... కొంతమందేమిటి! చాలా మంది ఆరోగ్య సమస్యతో అంటే రకరకాల రోగాలతో బాధపడుతున్నారు. మరి కొంతమంది కుటుంబ సమస్యలతో బాధపడుతున్నారు. ఒకరకంగా చూస్తే ఏ కుటుంబంలో చూసినా బాంధవ్యాలు సరిగ్గా లేవు. చాలా కుటుంబాలలో భార్యాభర్తల మధ్యే బాంధవ్యాలు సరిగ్గా లేవు. ఒక వేళ వారిద్దరి మధ్య వున్నా అత్తమామలతో కానీ, అన్నదమ్ములతో కానీ, పిల్లలతో కానీ సరైన బాంధవ్యాలు కనిపించవు. ఇంకా కొంతమంది ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. కొంతమంది వార్థక్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఇంకా కొంతమంది పనికి రాని అలవాట్లతో అంటే త్రాగుడు, పేకాట, వ్యభిచారం, గుట్కా, మత్తు పదార్థాలు లాంటి వాటితో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇలా ఎవరిని చూసినా ఏదో ఒక సమస్యతో, ఇంకా కొంతమంది ఒకటి కంటే ఎక్కువ సమస్యలతో బాధపడుతున్నారు. ఆలోచించండి ఇలా సమస్యలతో వున్న వారికి శాంతి ఎక్కడ వుంటుంది? అందుచేత ఎవరికి మనశ్శాంతి లేదు. ఒక రకంగా చూస్తే అందరికీ అన్నీ వున్నాయి కానీ ఎవరికీ శాంతి లేదు. ఇదీ ప్రస్తుత

ప్రపంచ స్థితి.

ఒకరకంగా చూస్తే సమస్య అన్నది ఎవరికైనా బాధాకరమే. అందుచేత సహజంగానే సమస్యల నుంచి బయట పడటానికి ప్రయత్నిస్తూ వుంటారు. కానీ ఎంత ప్రయత్నించినా సమస్యలలోంచి బయటపడటం అంత తేలికైన విషయంగా కనిపించదు. అసలు సమస్యకి కారణం కూడా వారికి అర్థం కాదు. వారు చేసే ప్రయత్నాల వల్ల ఒక సమస్య నుంచి బయటపడినట్టు కనిపించినా మరల వేరొక సమస్యలో చిక్కుకుంటున్నారు. అందుచేత ఏం చెయ్యాలో తెలియక ఆ పై వాడిని అంటే తమకు ఇష్టమైన దైవాన్ని ప్రార్థించడమో, పూజించడమో, భజనలు చెయ్యడమో, నమాజు చెయ్యడమో చేస్తున్నారు. కొంతమంది తమకు నచ్చిన గురువులను, స్వామీజీలను, బాబాలను ఆశ్రయిస్తున్నారు. వారు కూడా రకరకాల సాధనలు చేయిస్తున్నారు, రకరకాల మార్గాలు, రకరకాల బోధలు చేస్తున్నారు. ఏది ఏమైనా, ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎన్ని ప్రార్థనలు చేసినా, ఎన్ని ఆరాధనలు చేసినా, సమస్యలు సమస్యలుగానే వుంటున్నాయి. అసలు దీనికి కారణం ఏమిటి? ఈ విషయం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆలోచించాలి.

దీనికి ముఖ్య కారణం మానవులు ఆలోచించకపోవడమే! అందుచేత ముఖ్యంగా ఆలోచించాలి. ఎందుచేతనంటే మానవులు జీవితంలో ఆలోచించ వలసినవి చాలా వున్నాయి. ఎన్నో వుండగా వేటినీ ఆలోచించకపోవడమే జీవితం అస్తవ్యస్తంగా వుండటానికి కారణం. కనీసం కొన్నయినా ఆలోచించాలి. అన్నిటి గురించి ఆలోచిస్తేనే జీవితం సవ్యంగా వుంటుంది. సమస్యలు లేకుండా వుంటాయి. అంతేకాదు సరిగ్గా ఆలోచిస్తే ఈ సమస్యల నుంచి శాశ్వతంగా కూడా బయట పడవచ్చు. అందుచేత మానవులు ఆలోచించవలసినవి ఏమిటో కొన్ని చూద్దాం.

లోకంలో మానవులను గమనిస్తే ఇంచుమించు ఎవరు ఏ పని చేసినా మూడు కారణాలు కనిపిస్తాయి. (1) పూర్వం నుంచి , తరతరాల నుంచి ఆచారంగా వస్తుందని చేస్తున్నారు. (2) అందరూ చేస్తున్నారని చేస్తున్నారు. (3) ఎవరో చెప్పారని చేస్తున్నారు. అంతే కాని ఎవరూ ఆలోచించి చెయ్యటం లేదు. ఇది ఎవరికి వారు గమనిస్తే తెలుస్తుంది.

అసలు మానవుని దుఃఖానికి కారణం ఇదే. ఎందుచేతనంటే ఏ రకంగా చూసినా మానవులు ఇతరులను అనుకరిస్తున్నారు. అంటే ఇతరులు ఏది చేస్తే అదే చేస్తున్నారు. ఏది చెప్తే అదే చేస్తున్నారు. అంతేకాని ఎవరూ తాము చేస్తున్న పని గురించి ఆలోచించడం లేదు. కానీ ఆలోచించాలి. అసలు ఆ పని తాను ఎందుకు చేస్తున్నాను? అది సరైనదా? కాదా? ఆ పని సృష్టి ధర్మానికి అనుగుణంగా వుందా?

లేదా? ఆ పని చేస్తే తాను ఆశించిన ఫలితం వస్తుందా? లేదా? ఒక వేళ వస్తుందని భావిస్తే! ఆ ఫలితం ఎలా వస్తుంది? ఎంత వస్తుంది? లాంటివి ఆలోచించాలి. కనీసం ఆ పని చేసేటపుడైనా ఆలోచించాల్సి వుంది. అలా ఆలోచించినపుడే ఎవరైనా చేసిన పనిలో మంచి ఫలితాలు పొందగలుగుతారు, జీవితంలో లాభాలు పొందుతారు, ఆనందాన్ని పొందుతారు. కానీ అలా ఆలోచించకుండా చేసేవారు, ఇతరులను గుడ్డిగా అనుకరించేవారు ఎక్కువగా నష్టపోవాల్సి వస్తుంది.

ఎవరైనా జీవితంలో లాభం పొందాలంటే అనుకరించకూడదు! ఆలోచించాలి! మరి మానవులు ఎందుకు ఆలోచించి చెయ్యడం లేదు? ఎంతసేపూ ఎందుకు అనుకరిస్తున్నారు? దీనికి ముఖ్య కారణం. మానవునిలో ఆలోచించగలిగే శక్తి లేకపోవడం. అంటే బుద్ధి సరిగా పనిచేయకపోవడం. దీనికి ముఖ్య కారణం మానవులు (1) ఆహార నియమాలు పాటించకపోవడం. (2) ధ్యానం చెయ్యకపోవడం.

ఈ రెండూ ఎవరయితే పాటించరో వారి బుద్ధిమందగిస్తుంది. ఆలోచనా శక్తి తగ్గిపోతుంది. అప్పుడు వేరే దారిలేక అందరినీ అనుకరిస్తారు. అలా అనుకరించే వారు, ఎదుట వారి స్వార్థంతో తాము నష్టపోవలసి వస్తుంది. కానీ తనను తాను, అంటే ఎవరిని వారే అనుసరించినపుడు, స్వతంత్రంగా ఆలోచించినపుడు ఎప్పుడూ నష్టపోరు, లాభమే పొందుతారు. అందుచేత ఎప్పుడూ అనుకరించకండి – ఆలోచించండి, ఆలోచించే శక్తి పెంచుకోండి, బుద్ధిని వికసింప చేసుకోండి, బుద్ధి బలం పెంచుకోండి. దానికి (1) నిత్యం 'ధ్యాన' సాధన చెయ్యండి, (2) 'సాత్వికమైన శాకాహారం' తీసుకోండి, ఇంతకు తప్ప వేరే మార్గం లేదు.

## మానవుడు వేటి గురించి ఆలోచించాలి?

ముఖ్యంగా మానవుడు మూడు విషయాల గురించి ఆలోచించాలి.

(1) తాను వున్నాడు కాబట్టి తన గురించి, తన జీవితం గురించి, తాను చేసే కర్మలు గురించి ఆలోచించాలి.

(2) తాను యీ సృష్టిలో జీవిస్తున్నాడు కాబట్టి యీ సృష్టి గురించి, సృష్టి నియమాల గురించి ఆలోచించాలి.

(3) యీ సృష్టిని సృష్టి చేసిన సృష్టి కర్త అంటే భగవంతుడు వున్నాడు కాబట్టి ఆయన గురించి ఆయన శక్తి గురించి ఆలోచించాలి.

యీ మూడు విషయాలు ఆలోచించకుండా ఎవరయితే జీవిస్తారో వారు సమస్యలలో చిక్కుకుంటారు, కష్టాల పాలవుతారు, చివరకు దుఃఖాన్ని పొందుతారు.

# మానవుడు తన గురించి ఆలోచించాలి

ముఖ్యంగా తన గురించి అంటే తాను ఎవరు? తాను అంటే దేహం ఒక్కటే కాదు, దేహంతో పాటు మనస్సు, ఆత్మ కూడా వున్నాయి. అందుచేత దేహం గురించి, మనస్సు గురించి, ఆత్మ గురించి కూడా ఆలోచించాలి!

ఆలోచిస్తే శరీరం కంటే మనస్సే గొప్పదని తెలుస్తుంది. అందుచేత మనస్సు గురించి తెలుసుకోవాలి. అసలు మనస్సు అంటే ఏమిటి? మనస్సు పాత్ర ఏమిటి? మనస్సును అదుపులో వుంచితే వచ్చే లాభాలేమిటి? అదుపులో లేకపోతే వచ్చే నష్టమేమిటి? లాంటివెన్నో ఆలోచించాలి. అసలు మానవ జీవితానికి మనస్సుకు ఏమైనా సంబంధం వుందా? మనస్సు యొక్క గుణాలు ఏమిటి? గుణాలకు మానవుడు చేసే పనులకు సంబంధం వుందా? గుణాలు మారాలంటే ఏమి చెయ్యాలి? అంతేకాకుండా మనస్సుకు సంబంధించిన సమస్యలు ఏమైనా వున్నాయా? వుంటే ఆ సమస్యలు ఎలా ఉత్పన్నమవుతున్నాయి? వాటిని ఎలా అధిగమించాలి?లాంటివి కూడా ఆలోచించాలి. ఇలాంటివి ఆలోచిస్తేనే జీవితంలో శాంతి, ప్రశాంతి. లేకపోతే జీవితమంతా అశాంతే, అంతా నష్టమే. అందుచేత కనిపించని మనస్సుకు ప్రాముఖ్యం ఇవ్వాలి, మనస్సు గురించి ఆలోచించాలి.

అంతేకాదు మనస్సు కంటే కనిపించని ఆత్మ ఇంకా గొప్పది. కారణం ఆత్మే లేకపోతే శరీరం వుండదు, మనస్సు వుండదు. రెండూ అదృశ్యమైపోతాయి. అంతేకాదు శరీరానికి, ఇంద్రియాలకు, మనస్సుకు మూలం ఆత్మే. ఆత్మశక్తి వల్లే ఇవన్నీ పనిచేస్తున్నాయి. మరి అటువంటి ఆత్మ గురించి ఆలోచించాలి కదా? అసలు ఆత్మ ఎవరు? ఆత్మ శక్తి ఎంత? ఆత్మ విశిష్ఠత ఏమిటి? మానవునకు ఆత్మకు సంబంధం ఏమిటి? ఆత్మపాత్ర ఏమిటి? ఆత్మకు ప్రాముఖ్యం ఇస్తే వచ్చే లాభాలు, ఇవ్వకపోతే వచ్చే నష్టాలు లాంటివెన్నో ఆలోచించాలి. ఒక రకంగా మానవుని దుః ఖానికి కారణం ఆత్మకు ప్రాముఖ్యం ఇవ్వకపోవడమే. ఆత్మను పట్టించుకోకపోవడమే. ఆత్మ గురించి తెలుసుకోకపోవడమే. ఆత్మకు సంబంధించిన జ్ఞానం లేకపోవడమే.

ఆత్మకు సంబంధించిన జ్ఞానం లేకపోవడం వల్ల మహాభారత యుద్ధ సమయంలో అర్జునుడంతటి వాడు కూడా దుఃఖానికి లోనయ్యాడు. యుద్ధం చెయ్యలేనన్నాడు. అపుడు శ్రీ కృష్ణ భగవానుడు భగవద్గీత ద్వారా అర్జునునకు ఆత్మజ్ఞానాన్ని బోధించి అర్జునుని దుఃఖాన్ని తొలగించాడు. దీనిని బట్టి ఆత్మకు సంబంధించిన జ్ఞానం ఎంత గొప్పదో మనం అర్థం చేసుకోవచ్చు. అందుచేత ఆత్మ గురించి అధ్యయనం చెయ్యాలి. ఆత్మ గురించి ఆలోచించాలి. కనిపించడం లేదని

ఆలోచించడం మానకూడదు.

అంతేకాదు మానవుడు తన గురించి ఆలోచించవలసినవి ఇంకా వున్నాయి.

1) మానవుడు కనిపించే ఈ జీవితానికే ప్రాముఖ్యం ఇస్తున్నాడు. కానీ తనకు కనిపించని జీవితం కూడా వుందని తెలుసుకోలేకపోతున్నాడు. అంటే ఈ జన్మే కాదు. ఇంతకు ముందు కూడా తనకు జన్మలు వున్నాయి. అలాగే ఈ జీవితం అయిపోయిన తరువాత కూడా ఇంకా జీవితం వుంటుంది. అంటే ఇంకా జన్మలు వుంటాయి. మరి ఆ జీవితం గురించి కూడా ఆలోచించాలి. కారణం గత జీవితానికి ఈ జీవితానికి సంబంధం వుంటుంది. అంటే గత జన్మలని బట్టే ఈ జన్మ వుంటుంది. అలాగే ఈ జన్మలో జీవించే విధానాన్ని బట్టే భవిష్యత్ జన్మ ఆధారపడి వుంటుంది. అందుచేత కనిపించకపోయినా ఆ జన్మలు గురించి కూడా ఆలోచించాలి.
2) అలాగే మానవునకు కనబడే నేత్రాలతో పాటు కనబడని దివ్యనేత్రం కూడా వుంది.
3) కనబడే శరీరంతో పాటు కనబడని సూక్ష్మ శరీరం కూడా వుంది.
4) కనబడే సంపాదనతో పాటు కనబడని జ్ఞాన సంపాదన కూడా వుంది.
5) కనపడే భూలోకంతో పాటు కనబడని సూక్ష్మలోకాలు కూడా వున్నాయి.
6) కనబడే రూల్స్, చట్టాలతో పాటు కనబడని రూల్స్ అంటే ధర్మాలు కూడా వున్నాయి.
7) కనబడే మానవులలోని మేధావులతో పాటు కనపడని మేధావులు అంటే మాష్టర్సు అంటే దేవుళ్ళు, దేవతలు కూడా వున్నారు.

మరి వీటన్నిటి గురించి, వీరందరి గురించి కూడా ఆలోచించాలి. అందుచేత వీటిలో కొన్నిటి గురించి ఆలోచిద్దాం.

## కనపడే జీవితం - కనపడని జీవితం!

మానవులకు ప్రస్తుతం కనపడే జీవితంతో పాటు కనిపించని జీవితం కూడా వుంది. ఆ కనిపించని జీవితం గురించి అర్థం చేసుకుంటేనే కనిపించే జీవితం సుఖమయమవుతుంది. కనిపించే జీవితం స్వల్పం - కనిపించని జీవితం అనంతం. మానవుడు ఎక్కువగా ఉన్న కనబడని జీవితాన్ని వదలి తక్కువగా వుండే కనిపించే జీవితం గురించి ఆలోచిస్తే దుఃఖం కలుగుతుంది. అందుచేత కనబడని ఎక్కువ జీవితానికి ఎక్కువ సమయం కేటాయించాలి. కనబడే తక్కువ జీవితానికి తక్కువ సమయం కేటాయించాలి. కానీ తక్కువ జీవితానికి పూర్తి సమయం కేటాయిస్తున్నాం. అనంతమైన కనబడని జీవితానికి అసలు సమయమే

కేటాయించడం లేదు. ఇంతేకాదు మానవులు తమ గురించి ఇంకా ఆలోచించాలి.

అసలు మనం ఎవరు? ఎక్కడ నుండి వచ్చాం? తిరిగి ఎక్కడకు వెళతాం? గత జీవితానికి, ఇప్పటి జీవితానికి సంబంధం వుందా? దాని ప్రభావం ఈ జీవితం మీద వుంటుందా? ఉంటే ఎలా వుంటుంది? ఈ జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది? అసలు దేనికి ప్రాముఖ్యం ఇవ్వాలి? కనబడని శాశ్వతమైన జీవితానికా? కనిపించే, నశించిపోయే ఈ తాత్కాలికమైన జీవితానికా? అసలు వీటన్నిటినీ తెలుసుకోవటం ఎలా?

ఇన్ని విషయాలు ఆలోచించవలసి వుండగా, మానవులు డబ్బు, సంపదలు, పేరు ప్రఖ్యాతులు, పదవులలాంటివి సంపాదించటానికి ప్రయత్నిస్తున్నారు. ఎందుకంటే ఇంకా ఆలోచిస్తే ఇప్పుడు మనకు కనిపించే తల్లిదండ్రులే కాకుండా ఇంకా ఎంతో మంది తల్లిదండ్రులు గతంలో వున్నారు. అలాగే భార్యలు ఉన్నారు. భర్తలు ఉన్నారు. పిల్లలు ఉన్నారు. అలాగే భవిష్యత్తులో కూడా వుంటారు. మరి వారందరి గురించి ఎందుకు ఆలోచించటం లేదు?

గమనిస్తే యోగులు కనబడే జీవితం కంటే కనబడని జీవితానికే పూర్తి ప్రాముఖ్యం ఇచ్చారు. జీవితమంతా ధ్యానానికి కేటాయించారు కాని భోగులు కనబడే జీవితానికే ప్రాముఖ్యం ఇస్తున్నారు. భోగాలకు ప్రాముఖ్యం ఇస్తున్నారు. జీవితమంతా ధన సంపాదనకు కేటాయిస్తున్నారు. దుఃఖాల పాలవుతున్నారు. మనం కూడా యోగులులా కనబడని జీవితానికి కూడా ప్రాముఖ్యం ఇచ్చి కొంత సమయాన్ని ధ్యానానికి కేటాయిద్దాం. జీవితాన్ని సద్వినియోగం చేసుకుందాం.

మానవుడు తన గురించి, తన జీవితం గురించి, తాను చేయవలసిన పనులు గురించి, ఆలోచించవలసిన విషయాలలో ఇంకా కొన్నిటిని తెలుసుకుందాం.

(1) తాను తీసుకునే ఆహారం గురించి, ముఖ్యంగా మాంసాహారం గురించి ఆలోచించాలి.

(2) తాను చేసే కర్మలు గురించి ఆ కర్మల ఫలితాల గురించి, ముఖ్యంగా తన చేతలు, మాటల గురించి ఆలోచించాలి.

(3) తన అవసరాలేమిటో తెలుసుకుని వాటికి పరిమితమవ్వాలి. కోరికలకు బానిస కాకుండా వుండటం గురించి ఆలోచించాలి.

(4) తాను చేసే ఆరాధనలు గురించి తాను ఆరాధించే భగవంతుని గురించి ఆయన శక్తి గురించి ఆలోచించాలి.

(5) ముఖ్యంగా ముందు తాను చేయకూడని పనులు ఏమిటి? తరువాత చేయవలసిన పనులు ఏమిటి? అన్నది కూడా ఆలోచించాలి.

(6) పాప, పుణ్యాల గురించి ఆలోచించాలి.

(7) ధర్మం, అధర్మం గురించి ఆలోచించాలి.

(8) ముఖ్యంగా జీవితంలో తనకు ఇవ్వబడిన సమయం గురించి, ఆ సమయాన్ని తాను ఎలా వినియోగిస్తున్నాను? అసలు ఎలా వినియోగించాలి? అన్నది ఆలోచించాలి.

(9) తన జీవితంలో వచ్చే సమస్యలు కష్టాలు గురించి, వాటి కారణాలు గురించి ఆలోచించాలి. ముఖ్యంగా కష్టాలలో నుంచి బయటపడటం కంటే కూడా అసలు కష్టాలు ఎందుకు వస్తున్నాయి? కష్టాలకు కారణమేమిటి? అన్న వాటి గురించి ఆలోచించాలి.

(10) సంసారంలో బాంధవ్యాలు సరిగ్గా ఎందుకు లేవు? వాటి కారణాలు గురించి ఆలోచించాలి.

(11) వృద్ధాప్య సమస్యలకు కారణాల గురించి ఆలోచించాలి?

(12) భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఎందుకు వస్తున్నాయి? వాటికి కారణం గురించి ఆలోచించాలి.

(13) వినోదం కోసం తాను చేసే ఫంక్షన్సు, పార్టీల గురించి వాటి పర్యవసనాల గురించి ఆలోచించాలి.

(14) తాను మూఢంగా నమ్ముతున్న ఆచారాల గురించి వాటి వల్ల వచ్చే నష్టాల గురించి ఆలోచించాలి.

(15) చావు గురించి, చావు తరువాత చేస్తున్న కర్మ కాండలు గురించి ఆలోచించాలి.

(16) ఇంకా మరణం తర్వాత జీవితం గురించి, దాని కోసం తాను చేయవలసిన దాని గురించి, అంటే పునర్జన్మల గురించి ఆలోచించాలి.

(17) తన చుట్టూ వున్న వారి గురించి, వారితో తనకున్న సంబంధం గురించి, వారి పట్ల తన బాధ్యత గురించి ఆలోచించాలి.

(18) తన చుట్టూ వుండే ప్రాణులు, జంతువుల గురించి, వాటి పట్ల తాను నిర్వర్తించవలసిన ధర్మం గురించి ఆలోచించాలి.

(19) అలాగే గొప్పవారు, మహాత్ములు, యోగులు బోధించే విషయాలైన పరుల సేవ గురించి, అందరినీ, అన్నిటినీ ప్రేమించడం గురించి, లోకానికి ఇవ్వడం గురించి ఆలోచించాలి.

(20) ఆఖరుకు అన్ని సమస్యలకు పరిష్కారమైనదే కాకుండా, అన్ని సాధనల కంటే గొప్పదైన ధ్యాన సాధన గురించి కూడా ఆలోచించాలి.

అంతేకాదు ఒక రకంగా చూస్తే మానవులు చేసే పనులు అన్ని సృష్టికి, సృష్టి ధర్మాలకు విరుద్ధంగానే కనిపిస్తాయి. అంటే ఒకరకంగా మానవుడు చేసేవన్నీ రివర్సుగానే వుంటాయి. అవేమిటో కొన్ని చూద్దాం.

## మానవుడు చేసేది అంతా రివర్సే!

మానవుని దుఃఖానికి ముఖ్య కారణం మానవుడు చేసేది అంతా రివర్స్. అంటే సృష్టి నియమాలకు విరుద్ధంగా చేస్తున్నాడు. అంటే ఏది చెయ్యాలో అది చెయ్యడు – ఏది చెయ్యకూడదో అదే చేస్తాడు. ఏది ఆలోచించాలో అది ఆలోచించడు – ఏది ఆలోచించకూడదో అదే ఆలోచిస్తాడు. ఎలా ప్రవర్తించాలో అలా ప్రవర్తించడు – ఎలా ప్రవర్తించకూడదో అలా ప్రవర్తిస్తాడు. వాటికి కొన్ని ఉదాహరణలు చూద్దాం.

1. మానవునికి ఎంతసేపూ ఇతరులలో చెడు, తనలో మంచి కనబడుతుంది, కాని తనలోని చెడు ఇతరులలోని మంచి కనబడదు.
2. మానవుడు తాను మారడు కాని అందరూ మారాలంటాడు.
3. మానవుడు అందరికీ నీతులు చెబుతాడు, సలహాలు ఇస్తాడు, కానీ తాను ఆచరించడు.
4. మానవుడు చెప్పవలసింది నిజం కానీ చెబుతున్నది అబద్ధం.
5. మానవుడు ఉండవలసింది నిస్వార్థంగా, ధర్మంగా కానీ ఉంటున్నది స్వార్థంగా, అధర్మంగా.
6. బుద్ధిబలం గొప్పది కానీ మానవుడు దేహ బలానికే ప్రాముఖ్యం ఇస్తున్నాడు.
7. మానవుడు సృష్టిలో అన్నిటినీ ప్రేమించాలి కానీ అందరినీ ద్వేషిస్తున్నాడు.
8. మానవుడు ఎవరినీ మోసగించకూడదు. హింసించకూడదు, అవమానించకూడదు. కానీ మోసగిస్తున్నాడు. హింసిస్తున్నాడు, అవమానిస్తున్నాడు.
9. మానవుడు తేలికని చెడే చేస్తున్నాడు కానీ కష్టమని మంచి చెయ్యడం లేదు.
10. మానవుడు జీవించవలసింది శాంతిగా, నిర్భయంగా, కానీ జీవిస్తున్నది అశాంతిగా, భయం... భయంగా.
11. అశాశ్వతమైన వాటి కోసం తాపత్రయ పడతాడు, వాటి కోసమే ప్రయత్నిస్తాడు, వాటి కోసమే జీవితాన్నంతా వృధా చేస్తాడు, కానీ శాశ్వతమైన దాని కోసం ప్రయత్నించడు, జీవితాన్ని కొద్దిగా కూడా వినియోగించడు.
12. మానవుడు తన శక్తిని, కాలాన్ని, జీవితాన్ని ఉపయోగించవలసింది ప్రాముఖ్యం ఇవ్వవలసింది ఒక దానికి, కానీ ఉపయోగిస్తున్నది, ప్రాముఖ్యం ఇస్తున్నది వేరొక దానికి.

13. మానవుడు కృషి చెయ్యడు. కానీ కోరికలు కోరుతూ వుంటాడు. “కష్టేఫలి” అన్న విషయం మర్చిపోతాడు.
14. మానవుడు సంపాదించవలసింది నశింపులేని దానిని కానీ సంపాదిస్తున్నది నశించిపోయే దానిని.
15. ధనాన్ని అవసరాలకు వుపయోగించాలి కానీ ఆర్భాటాలకు వుపయోగిస్తున్నాడు.
16. మానవుడు కోరుకోవలసింది శాశ్వత ఆనందం కానీ కోరుకుంటున్నది తాత్కాలిక సుఖం.
17. మానవుడు కష్టాలు అనుభవిస్తున్నాడు అంటే చేసిన పాపాల అప్పు తీర్చుకుంటున్నాడు. అంటే సంతోషించాలి కానీ అప్పు తీరుతున్నందుకు అంటే కష్టాలకు దుఃఖిస్తున్నాడు.
18. మానవుడు పాపాలు చేస్తున్నాడు అంటే అప్పుపెంచుకుంటున్నాడు. అంటే పాపాలు చెయ్యడానికి బాధపడాలి కానీ బాధపడడు సరికదా ధైర్యంగా పాపాలు చేసేస్తున్నాడు.
19. మానవుని జీవితంలో ఒక సంవత్సరం గడిచిందంటే చావుకి దగ్గర అయినట్టు అంటే జీవితాన్ని నష్టపోతునట్టు కానీ పుట్టిన రోజుని, పెళ్ళి రోజుని, రిటైర్‌మెంట్ రోజుని వేడుకగా పండుగ చేసుకుంటున్నాడు.
20. మానవుడు శాంతి, శక్తి పొందాలంటే తలపులు బోడి చెయ్యాలి అంటే ధ్యానంలో ఆలోచనలు తొలగించాలి అంటే నిర్విషయం చెయ్యాలి. కానీ తలలు బోడి చేస్తున్నాడు.
21. మానవుడు భావాన్ని శుద్ధి చేసుకోవాలి కానీ దేహాన్ని శుద్ధి చేస్తున్నాడు.
22. మానవుడు అంతర్ సౌందర్యం చూడాలి. కానీ బాహ్య సౌందర్యాన్ని చూస్తున్నాడు.
23. మానవుడు సంకల్పిస్తే ఏదైనా సాధించగలడు. కానీ ఏమీ సాధించలేని వానిగా అల్పునిగా ప్రవర్తిస్తున్నాడు.
24. మానవుడు అందరూ తనను ప్రేమించాలంటాడు. కానీ తాను మాత్రం ఎవరినీ ప్రేమించడు.
25. తాను ఆత్మ అయి వున్నాడు కానీ దేహమే తాను అని భావిస్తాడు.
26. ఉన్నదాన్ని లేదనుకుంటాడు, లేనిదాన్ని ఉందనుకుంటాడు.
27. భగవంతుడంటే ఇష్టమంటాడు. ఎంతసేపూ తనకు నచ్చేటట్టు చేస్తాడు. కానీ భగవంతుడు మెచ్చేటట్టు చెయ్యడు.
28. ఎంతసేపూ తనకు ఏమీ లాభం లేకపోయినా ఇతరులు ఏమనుకుంటారోననే

చేస్తాడు. కానీ భగవంతుడు ఏమనుకుంటాడోనని చెయ్యడు.

29. ఎంతసేపూ లోకులు మెచ్చుకునే రూపాన్ని సరిచేసుకుంటూంటాడు కానీ భగవంతుడు మెచ్చుకునే గుణాల్ని సరిచేసుకోడు.
30. మానవుడు భూమి మీదకు వచ్చిన కారణం ఒకటి, కానీ చేసేది వేరొకటి.
31. మానవుడు చదువవలసింది చావు పుట్టుకలు లేని చదువు కానీ చదువుతున్నది వేరొకటి.
32. మానవుడు భగవంతుణ్ణి వెతకవలసింది ఒకచోట కానీ వెతుకుతున్నది వేరొకచోట.
33. భగవంతుడు తానై ఉన్నాడు, కానీ వేరే వున్నాడనుకుని ఆరాధిస్తున్నాడు.
34. భగవంతునికి రూపం లేదు కానీ రూపం వుందనుకుంటాడు.
35. సమస్త జీవులు, భగవంతుని రూపాలైనా అన్నీ, అందరూ వేరని భావిస్తాడు.
36. మానవుడు ధ్యానం చేసి జ్ఞానం సంపాదించుకోవాలి కానీ అజ్ఞానంలోనే జీవిస్తున్నాడు.
37. శ్రీకృష్ణ భగవానుడు గీతలో చెప్పిన సందేశం పాటించడు కానీ పారాయణ చేస్తాడు.
38. భగవంతుడు గొప్పవాడు అంటాడు. ఆరాధిస్తాడు. అంతేకానీ గొప్పవాడైన భగవంతుడు చెప్పింది ఆచరించడు.
39. గీతలో భగవంతుడు మానవుని ఉద్ధరించుకోమంటాడు కానీ మానవుడు భగవంతునినే ఉద్ధరించమంటాడు.
40. గీతలో భగవంతుడు చెప్పిన విధంగా నడుచుకోమని మనస్సుకు చెప్పడు. కానీ మనస్సుయొక్క కోరికలు తీర్చమని భగవంతుని ప్రార్థిస్తాడు.
41. భగవంతునికి నచ్చే విధంగా ప్రవర్తించడు. కానీ తాను కోరేవన్నీ భగవంతుడు నెరవేర్చాలంటాడు.
42. భగవంతుడు యోగి అవ్వమంటే మానవుడు భోగి అవుతున్నాడు.
43. మానవుడు అజ్ఞానులనుంచి పనికిరానివి అలవాటు చేసు కుంటున్నాడు కాని జ్ఞానులనుండి పనికొచ్చేవి అలవాటు చేసుకోవట్లేదు.

అలా ఆలోచిస్తే లోకంలో మానవులు చేయకూడని పనులు అంటే చేయకూడని కర్మలు వున్నాయి. అలాగే చేయవలసిన పనులు అంటే చేయవలసిన కర్మలు వున్నాయి. ముఖ్యంగా మానవుడు ముందు చేయకూడని పనులు చేయకుండా వుండాలి. తరువాత చేయవలసిన పనులు చెయ్యాలి. ముఖ్యంగా చేయకూడని పనులు గురించి ఆలోచించాలి.

దీనికి ముఖ్య కారణం చేయకూడని పనులు చేస్తే వచ్చే ఫలితం కష్టాలు, నష్టాలు, చివరకు దుఃఖం. కానీ చేయవలసిన పనులు చేస్తే వచ్చే ఫలితం సుఖాలు, లాభాలు, చివరకు ఆనందం. ఎవరైనా ముందు నష్టాలు, కష్టాలు రాకుండా చేసుకోవాలి. కారణం సుఖాలు వున్నా, లాభాలు కలిగినా... కష్టాలు వస్తే వాటి ప్రయోజనం వుండదు, అనుభవించలేరు, ఆనందాన్ని కోల్పోతారు. అందుచేత ఎవరైనా సరే చేయకూడని పనులు మీద దృష్టి పెట్టాలి.

అలా అన్నీ సృష్టికి విరుద్ధమైనవి చెయ్యడం వల్ల, అంతులేని దుఃఖానికి లోనవుతున్నాడు. దీనికి ముఖ్య కారణం మానవునకు జ్ఞానం లేకపోవడమే. జ్ఞానం లేకపోవడానికి కారణం "ధ్యానం" చెయ్యకపోవడమే. అందుచేత ఆలోచించండి, ధ్యానం చెయ్యండి, జ్ఞానాన్ని సంపాదించుకోండి, రివర్సుగా ప్రవర్తించకండి, సవ్యంగా చెయ్యండి, ఆనందంగా జీవించండి.

## సృష్టి గురించి ఆలోచించాలి

ముఖ్యంగా తాను ఈ సృష్టిలో జీవిస్తున్నాను అన్న విషయం మర్చిపోకూడదు. దీనిని ఎప్పుడూ సదా గుర్తుంచుకోవాలి. అంతేకాదు ఈ సృష్టిలో జీవిస్తున్న వారంతా ఈ సృష్టి నియమాలకు కట్టుబడి వుండాలి. అంటే సృష్టికి అనుగుణంగా జీవించాలి. విరుద్ధంగా జీవిస్తే సృష్టి నియమాలననుసరించి శిక్షలు అనుభవించవలసి వస్తుందని కూడా తెలుసుకోవాలి. ఆ శిక్షలే మానవులకు వచ్చే కష్టాలని కూడా తెలుసుకోవాలి.

అందుచేత మానవునకు కష్టాలు రాకూడదంటే తప్పనిసరిగా సృష్టి నియమాలు పాటించాలి. ఆ సృష్టి నియమాలనే 'ధర్మాలు' అని అంటారు. అంటే ఈ సృష్టిలో జీవించే ప్రతి ఒక్కరూ సృష్టి ధర్మాలననుసరించి జీవించాలి. సృష్టి ధర్మాలు పాటించాలి, సృష్టి ధర్మాలకు అనుగుణమైన పనులు చెయ్యాలి. వీటినే చెయ్యవలసిన పనులు లేక ధర్మాలు అంటారు. అలా జీవించడమే సరియైన, సవ్యమైన జీవితం. అలాగే సృష్టి ధర్మాలకు విరుద్ధమైన పనులు చెయ్యకూడదు. వీటినే చెయ్యకూడని పనులు లేక అధర్మం అంటారు. అలా జీవించడమే సరి కాని, అపసవ్యమైన జీవితం.

అందుచేత ఈ ధర్మం గురించి అధర్మం గురించి, ధర్మం యొక్క గొప్పతనం గురించి మనం కొంచెం తెలుసుకుందాం.

### ధర్మం – అధర్మం!

వ్యాస భగవానుడు ధర్మం యొక్క విశిష్టతను లోకానికి అందించటానికి

వ్రాసిన మహాకావ్యమే "మహా భారతం". సృష్టిలో ధర్మం యొక్క గొప్పతనం మనం మహాభారతం ద్వారా తెలుసుకుంటాం. వేదాలను లోకానికి అందించిన బ్రహ్మర్షి, మహామహాగొప్ప ఋషి, వ్యాస మహర్షి. ఆయన సృష్టి ధర్మాన్ని ఎంత గట్టిగా నొక్కి వక్కాణించారో! దానికోసం ఎంత గొప్ప మహాకావ్యం వ్రాసారో! మనం తెలుసుకోవచ్చు.

మహాభారతమంతా రెండు విషయాలమీదే నడిచింది. అది పాండువులు, కౌరవుల మధ్య జరిగిన యుద్ధం కాదు. అది ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగిన యుద్ధం. అది ధర్మం యొక్క గొప్పతనం, ధర్మాచరణ వల్ల కలిగే లాభం తెలియపరిచింది. అంతేకాదు అధర్మం యొక్క పర్యవసానాన్ని బోధించిన అద్భుత కావ్యం. అది ధర్మాన్ని అనుసరించిన పాండవులకు, అధర్మాన్ని ఆశ్రయించిన కౌరవులకు మధ్య జరిగిన యుద్ధాన్ని బోధించింది! అంటే 'ధర్మాధర్మాల' పర్యవసానాన్ని బోధించింది.

మహాభారత కావ్యాన్ని కనుక మనం అధ్యయనం చేస్తే కొన్ని విషయాలు తెలుస్తాయి. అధర్మాన్ని ఆశ్రయించిన కౌరవుల వద్ద సైనిక బలం అధికంగా వుంది. అతి రథ మహారథులైన మహాయోధులంతా వున్నారు. కానీ పరాజితులయ్యారు. ధర్మాన్ని ఆశ్రయించిన పాండవులకు సైనిక బలం తక్కువ. పైగా అతిరథ మహారథులు కూడా తక్కువ. కానీ చివరకు విజయం సాధించారు.

అంతేకాదు అధర్మాన్ని ఆశ్రయించిన కౌరవులకు దైవబలం లేదు. కానీ ధర్మాన్ని కాపాడిన పాండవుల పక్షాన దైవబలం వుంది. అంటే దైవం వున్నాడు. అంటే శ్రీ కృష్ణుడు వున్నాడు. అంటే దైవానుగ్రహం ధర్మాన్ని ఆశ్రయించిన వారికే వుంటుందని దీనిని బట్టి మనకు తెలుస్తుంది.

ధర్మాన్ని ఆశ్రయించిన పాండవులు తాత్కాలికంగా మొదట్లో కష్టాల పాలైనట్లు కనిపించారు, కానీ చివరకు విజయం సాధించారు, సుఖించారు. అధర్మాన్ని ఆశ్రయించిన కౌరవులు మొదట్లో భోగాలు పొందినట్లు కనిపించినా చివరకు పరాజయం పాలయ్యారు, నాశనమయ్యారు.

దీనిని బట్టి ఎవరైనా, ఎంతటివారైనా సరే అధర్మాన్ని ఆశ్రయించినా, అధర్మాన్ని సమర్థించినా, అధర్మం పక్షాన వున్నా, అధర్మాన్ని చూస్తూ వూరుకున్నా నాశనమవుతారని, శిక్షింపబడతారని మహా భారతాన్ని బట్టి తెలుస్తుంది. ధర్మాన్ని ఆశ్రయించిన వారికి దైవశక్తి తోడుగా వుంటుందని, వారిని ఆపత్ సమయాలలోనే కాదు, ఎల్లప్పుడూ దైవ శక్తి కాపాడుతూ వుంటుందన్నదే మహాభారతంలోని సందేశం. అంతేకాదు అధర్మాన్ని ఆశ్రయించిన వారివైపు దైవం ఉండడని, దైవం

దూరమవుతాడని, దైవంచే శిక్షింపబడతారని కూడా తెలుస్తుంది.

ధుర్యోధనుడు, శకుని, కర్ణుడు వీరికి ధర్మం తెలుసు కానీ అధర్మాన్నే ఆశ్రయించారు. అలాగే భీష్ముడు, ద్రోణుడు లాంటి వారికి కూడా ధర్మం తెలుసు కానీ అధర్మాన్ని చూస్తూ ఊరుకున్నారు. అధర్మం పక్షాన వున్నారు. అందుకే అంతా నాశనమయ్యారు, శిక్షింపబడ్డారు. పాండవులు ధర్మాన్ని రక్షించారు... చివరకు రక్షింపబడ్డారు. అందుకే "ధర్మో రక్షతి రక్షితః" అన్నారు.

మహా భారత గాధ యొక్క సందేశం ప్రతీ ఒక్కరిని ధర్మాన్ని రక్షించమనే. అందుచేత ధర్మమంటే ఏమిటి? ధర్మం గురించిన విషయాలు మరి కొన్ని తెలుసుకుందాం.

**" 'ధర్మమంటే' ఎవరయితే ఈ సృష్టిని సృష్టి చేశారో... ఆ సృష్టి కర్త అంటే భగవంతుడు ఏర్పాటు చేసిన నియమాలు; అంటే ఈ సృష్టిలోని జీవులు, జీవరాసులు ప్రవర్తించవలసిన నియమాలనే ధర్మాలు" అంటారు.** ప్రతీ జీవి ఎలా జీవించాలి? ఎలా నడుచుకోవాలి? అని తెలిపేదే 'ధర్మం'. భగవంతుడు తన సృష్టిలోని సమస్త జీవులూ ఆనందంగా జీవించడం కోసం ఏర్పాటు చేసిన నియమాలే ధర్మాలు.

ధర్మం ఎంత గొప్పదంటే "ఒక ఏనుగు పాదముద్రలో అన్నీ జంతువుల పాదముద్రలు ఎలా ఇముడుతాయో అలాగే ఒక్క ధర్మంలోనే సమస్తమూ ఇమిడి వుంది". కారణం సృష్టిలో ప్రతీది ధర్మాన్ని అనుసరించే వుంటుంది. అందుచేత ప్రతీ ఒక్కరూ ధర్మాన్ని అనుసరించాలి, కాపాడాలి. ఇదే ప్రకృతి ధర్మం. అంతేకాదు కుండ నిలవాలంటే క్రింద చుట్టు వుండాలి. చుట్టు లేకుండా కుండ ఎలా నిలవదో అలాగే ధర్మం లేకపోతే సృష్టీ నిలవదు. అందుకే సృష్టి పూర్తిగా ధర్మం మీదనే ఆధారపడి వుంది.

అందుకే "ధర్మో రక్షతి రక్షితః" అన్నారు. అంటే "ధర్మాన్ని రక్షిస్తే అది మిమ్మల్ని రక్షిస్తుంది" అని అర్థం. అందుచేత మానవులు రక్షింపబడాలంటే ముందు మానవుడు ధర్మాన్ని రక్షించాలి. 'ధర్మాన్ని' రక్షించకపోతే మానవుడ్ని ఎవరూ రక్షించలేరు, మానవుడు రక్షింపబడలేడు. పూజల వల్ల కొబ్బరి కాయల వల్ల, అరటిపళ్ళ వల్ల, మొక్కులవల్ల, ప్రార్థనల వల్ల ఎవరూ రక్షింపబడలేరు. కారణం 'ధర్మమే' ఎవరినైనా రక్షించగలదు. అందుచేత మానవుడు 'ధర్మాన్ని' ఆశ్రయించాలి, 'ధర్మాన్ని' ఆచరించాలి. అదే మానవునికి శరణ్యం, అన్యధాశరణంనాస్తి.

మానవుడు అన్నిటినీ ఆశ్రయిస్తున్నాడు. కాని 'ధర్మాన్ని' ఆశ్రయించడం లేదు, ధర్మం గురించి ఆలోచించడం లేదు. సృష్టికే ఆధారమైన 'ధర్మాన్ని' ఆశ్రయించకుండా, 'ధర్మాన్ని' రక్షించకుండా మానవుడు ఎప్పటికీ కష్టాలనుంచి

బయటపడలేడు. కాని మానవుడు కష్టాల నుంచి బయటపడటానికి విగ్రహాలను ఆశ్రయిస్తున్నాడు. గుళ్ళను, చర్చిలను, మసీదులను ఆశ్రయిస్తున్నాడు. పూజలను, ప్రార్థనలను, నమాజులను ఆశ్రయిస్తున్నాడు. కాని 'ధర్మాన్ని' మాత్రం ఆశ్రయించడం లేదు. అందుచేత ఆలోచించవలసింది ధర్మం గురించి కాని ఆరాధనల గురించి కాదు.

మరి ధర్మాన్ని ఆశ్రయించాలంటే! అంటే కాపాడాలంటే ధర్మమంటే ఏమిటో తెలుసుకోవాలి. మరి మనకు ధర్మం ఎలా తెలుస్తుంది? తెలుసుకున్న ధర్మాన్ని ఆచరించగలగాలంటే ఏం చెయ్యాలి? ఇవన్నీ ముందు మనం తెలుసుకోవాలి.

**"ధర్మమనేది బయట వారు మనకు చెప్పేది కాదు. మన అంతరాత్మ నుంచి పైకి సహజంగా ఉబికేది"** అని పత్రీజీ చెప్పారు.

కారణం **"సృష్టి చేసిన ఆత్మకు సృష్టి ధర్మాలు తెలుస్తాయి కానీ, సృష్టింపబడిన మనస్సుకు సృష్టి ధర్మాలు తెలియవు".**

ధర్మాన్ని నిర్దేశించింది భగవంతుడే కనుక, ధర్మం ఆయనకే తెలుసు. అందుచేత ఆయన చెప్పినట్టు వినాలి, నడుచుకోవాలి! ఇది ఎలా సాధ్యమవుతుంది?

భగవంతుడు అందరిలో 'ఆత్మ' రూపంలో వున్నాడు. ఆయన అందరికీ వారి వారి ధర్మాల్ని ఎప్పటికప్పుడు తెలియచేస్తున్నాడు. గమనిస్తే మనకు ఇది స్పష్టంగా తెలుస్తుంది. ఎవరైనా సరే సృష్టి ధర్మాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నా, మాట్లాడుతున్నా, చేస్తున్నా వెంటనే ఎవరికి వారికి లోపల నుంచి హెచ్చరిక వస్తుంది. అలా చేయకూడదని తెలుస్తుంది. అలా ప్రతీ విషయంలో, ప్రతీ పనిలో, ప్రతీ క్షణం హెచ్చరిక వస్తూనే వుంటుంది. అంటే భగవంతుడు అంతరాత్మ రూపంలో హెచ్చరిస్తూనే వుంటాడు. కాని మానవులే దానిని లక్ష్యపెట్టరు. అందుచేత తెలుసుకోండి **"అంతరాత్మ చెప్పిన విధంగా నడుచుకున్న వాడు ధర్మాన్ని ఆచరించినట్టే, ధర్మాన్ని కాపాడినట్టే".**

మానవుడు ఆత్మను అనుసరించాలి కానీ మనస్సును కాదు. కారణం ఆత్మే భగవంతుడు కాబట్టి.

మనస్సంటే మానవుడు ఆ మనస్సునే మాయ అంటారు. మారుడు అంటారు. సైతాన్ అని కూడా అంటారు. మనస్సనే మాయ నుంచి బయట పడాలంటే... అంటే సైతాను ప్రభావం పోవాలంటే ధ్యానమే మంచి మార్గం. కారణం ధ్యానం చేసే కొద్దీ మనస్సు యొక్క ప్రాముఖ్యం తగ్గుతూ వుంటుంది. అపుడు అంతరాత్మను వినగలుగుతారు. అలా ధ్యానం చెయ్యడం ద్వారా అంతరాత్మను వినగలిగేవారు అన్ని ధర్మాలు స్పష్టంగా తెలుసుకోగలుగుతారు, ధర్మాన్ని ఆచరించ

గలుగుతాడు. అందుచేత ధ్యానాన్ని విశేషంగా చేద్దాం, అంతరాత్మ చేసే ప్రబోధాలను అంటే ధర్మాలను ఆచరిద్దాం, ధర్మాన్ని కాపాడుదాం, జీవితాన్ని సుఖమయం చేసుకుందాం. ముఖ్యంగా కొన్ని ధర్మాలను తెలుసుకుందాం.

ఈ సృష్టిలో అంతా ఒకటే, అంతా సమానమే అన్నది మొదటి ధర్మం, అలాగే సృష్టిని, సృష్టిలోని అందాల్ని అనుభవించే హక్కు అందరికి సమానమన్నదే ఇంకొక ధర్మం. అంతే కాదు సృష్టిలోని సమస్త జీవులు ఆనందంగా జీవించాలన్నదే మరొక ధర్మం. అందుచేత తన ఆనందం కోసం ఇంకొకరి ఆనందాన్ని హరించకూడదు.

ఎవరు ఏది చేస్తే అదే పొందబడడం అన్నది ఇంకొక ధర్మం. అంటే చెడు చేస్తే చెడు... మంచి చేస్తే మంచి పొందుతారు. అంతేకాదు ఏది ఇస్తే అది, ఎలాంటిది ఇస్తే అలాంటిది, ఎంత ఇస్తే అంత పొందుతారని తెలుసుకోవాలి. అందుకే ఏది విత్తితే ఆ పండే కోసుకోగలరని జీసస్ చెప్పారు. అంటే ఆనందం పంచితే ఆనందం. శాంతి ఇస్తే శాంతి, దుఃఖం కలిగిస్తే దుఃఖం, హింస చేస్తే హింస, నష్టాన్ని కలుగచేస్తే నష్టం పొందుతారని తెలుసుకోవాలి.

## ఆచారము - ధర్మము!

కానీ ప్రస్తుతం లోకంలో మానవులు ధర్మాల కంటే ఆచారాలకే ప్రాముఖ్యం ఇస్తున్నారు. అంతేకాదు ఆచారాల గురించి ఆలోచిస్తున్నారు కానీ ధర్మాల గురించి ఆలోచించడం లేదు. ఆచారాలను కాపాడుతున్నారు కానీ ధర్మాలను కాపాడటం లేదు. బోధించే వారు కూడా ఆచారాలను పాటించమంటున్నారు కానీ ధర్మాలను పాటించమనటం లేదు. కారణం ధర్మం యొక్క ప్రాముఖ్యం తెలియకపోవడమే, పైగా ఆచారాలనే ధర్మాలని అనుకుంటున్నారు. కారణం ఆచారాలకి, ధర్మానికి తేడా తెలియకపోవడం వల్లనే. అందుచేత ఈ రెండింటికి తేడా తెలుసుకుందాం.

ఏదైనా ఒక కుటుంబంలో కానీ, కులంలో కానీ, మతంలో కానీ, ప్రాంతంలో కానీ కొంతమంది పెద్దలు వుంటారు. అలా కుటుంబంలో వున్న వారిని కుటుంబ పెద్దలు అంటారు. అదే కులంలో అయితే కుల పెద్దలు అంటారు. మతంలోనైతే మత పెద్దలంటారు. అదే ఒక ప్రాంతంలో కానీ దేశంలో కానీ అయితే నాయకులు అంటారు. వారు సహజంగా తమ కుటుంబీకుల సౌకర్యార్థం, కులస్థుల సౌకర్యార్థం, మతస్తుల సౌకర్యార్థం, ప్రాంత, దేశ ప్రజల సౌకర్యార్థం కొన్ని నియమాలు ఏర్పాటు చేసారు. అలా ఏర్పాటు చేసిన నియమాలను తరతరాలుగా ఆ కుటుంబంలో, ఆ కులంలో, ఆ మతంలో ఆచరిస్తూ వుంటారు. అలా ఆచరిస్తూ వస్తున్న వాటినే 'ఆచారాలు' అంటారు.

అలాగే భగవంతుడు తాను చేసిన సృష్టిలోని సమస్త జీవులు, ప్రాణులు ఆనందంగా జీవించడం కోసం కొన్ని నియమాలు ఏర్పాటు చేసాడు. అలా భగవంతుడు ఏర్పాటు చేసిన నియమాలనే 'ధర్మాలు' అంటారు.

అంటే ఆచారాలు మానవులు ఏర్పాటు చేసుకున్నవి. కానీ ధర్మాలు భగవంతుడు ఏర్పాటు చేసినవి. కానీ గమనిస్తే లోకంలో, పెద్దలు ఏర్పాటు చేసిన ఆచారాలకే ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నారు. కానీ, భగవంతుడు ఏర్పాటు చేసిన ధర్మాలకు ప్రాముఖ్యం ఇవ్వటం లేదు. కానీ ఆలోచిస్తే ఆచారాల కంటే భగవంతుని ధర్మాలే ముఖ్యమైనది. కారణం మానవులు జీవిస్తున్నది భగవంతుని సృష్టిలోనే. ఈ సృష్టిని నడిపిస్తున్నది భగవంతుడే. సృష్టి నడపబడుతున్నది భగవంతుడు ఏర్పాటు చేసిన ధర్మ సూక్ష్మాలతోనే.

మానవుడు ఆచారాలకు కట్టుబడిపోయి వాటికే ప్రాముఖ్యం ఇస్తున్నాడు. తన కుటుంబానికీ, కులానికీ, మతానికి ప్రాముఖ్యం ఇస్తున్నాడు. కాని భగవంతుని ధర్మాలకు, సృష్టిధర్మాలకు ప్రాముఖ్యం ఇవ్వడం లేదు. భయపడడం లేదు.

కాని ఆలోచించండి ధర్మాన్ని ఆచరించకపోతే సృష్టినియమాలననుసరించి కచ్చితంగా శిక్షింపబడతారు. నష్టపోతారు. జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు దాని ఫలితం అనుభవించవలసి వస్తుంది. ఈ జన్మలో కాకపోయినా ఏదో ఒక జన్మలోనయినా అనుభవించవలసిందే. అంటే చచ్చినా కూడా తప్పించుకోలేరు.

ఎవరైనా మానవుల నుంచి తప్పించుకోగలరు కాని సృష్టిధర్మం నుంచి ఎవరూ తప్పించుకోలేరు. కారణం కనబడే మానవుల కంటే కనబడని భగవంతుడే గొప్పవాడు. అంతేకాదు ఆచారాలు మానవులు తమ సౌకర్యార్థం ఏర్పాటు చేసుకున్నవి కానీ ఆచారాలు భగవంతుని ధర్మాన్ననుసరించి ఏర్పాటు చేసినవి కావు. సృష్టిలో మానవులకు కష్టాలు వచ్చేది ధర్మాన్ని ఉల్లంఘిస్తేనే కాని, ఆచారాలు ఉల్లంఘిస్తే కాదు. ఆచారాలు పాటించకపోతే పాపం కాదు, ధర్మాన్ని పాటించకపోతే పాపం. ఆచారాలు పాటించక పోతే మానవుల దృష్టిలో తప్పుకాని, ధర్మం పాటించకపోతే సృష్టిలో భగవంతుని లెఖ్ఖలో తప్పవుతుంది.

ఎందుచేతనంటే ఒక కుటుంబంలో వున్న ఆచారం ఇంకో కుటుంబంలో వుండదు. ఒక కులంలో వున్న ఆచారం ఇంకో కులంలో వుండదు. అలాగే ఒక మతంలో వున్న ఆచారం ఇంకో మతంలో వుండదు. ఒక ప్రాంతంలో వున్న ఆచారం ఇంకో ప్రాంతంలో వుండదు. కానీ ధర్మం అన్ని కులాలకు, అన్ని మతాలకు అన్ని ప్రాంతాలకు ఒక్కటే. ఆలోచిస్తే ఒకచోట తప్పయింది అన్ని చోట్లా తప్పవ్వాలి. ఒకచోట ఒప్పయితే అన్నిచోట్లా ఒప్పవ్వాలి. అలాంటిదే ధర్మం.

గమనిస్తే ఒక మతంలో బొట్టు పెట్టుకోవడం ఆచారం. ఆ మతంలో బొట్టు పెట్టుకోకపోతే పాపం. కానీ ఇంకొక మతంలో బొట్టు పెట్టుకోకపోవడం ఆచారం. ఇక్కడ బొట్టు పెట్టుకోకపోయినా పాపం కాదు. అలాగే ఇంకొక మతంలో బురఖా కప్పుకోవడం ఆచారం. ఆ మతంలో బురఖా లేకపోతే పాపం. ఇలా మతాన్ని బట్టి ఆచారాలు వుంటాయి. అంటే అన్ని మతాలకు, ఆచారాలు ఒకేలా వుండవు. కానీ అన్ని మతాల వారికి భగవంతుని ధర్మం ఒక్కటే.

అలాగే ఒక మతంలో పూజ చేయడం ఆచారం. ఇంకొక మతంలో ప్రార్థన చేయడం ఆచారం. మరొక మతంలో నమాజు చేయడం ఆచారం. అలాగే ఒక మతంలో గుడికి వెళ్ళడం ఆచారం. మరొక మతంలో చర్చికి వెళ్ళడం ఆచారం. ఇంకొక మతంలో మసీదుకు వెళ్ళడం ఆచారం. అలా మతాలను బట్టి ఆచారాలు మారుతూంటాయి.

కానీ మానవులందరికీ సమానమైనది ధర్మం. అంటే అన్ని కులాల వారికి, మతాల వారికి ధర్మం ఒక్కటే.

ఆచారాలు కుటుంబాన్ని బట్టి, కులాన్ని బట్టి మతాన్ని బట్టి, ప్రాంతాలను బట్టి మారుతూ వుంటాయి. **"మారేవి ధర్మాలు కాదు. మారనిదే ధర్మం".** గమనిస్తే మానవులు ఏర్పాటు చేసిన ఆచారాలు కాలానుగుణంగా అదే కుటుబంలో, అదే కులంలో, అదే మతంలో మారుతూ వుంటాయి. కాని కాలం మారినా, ధర్మాలు మాత్రం మారవు.

మానవులు **"మార్పు చెందే ఆచారాలకు ప్రాముఖ్యం ఇస్తున్నారు కాని మార్పు చెందని ధర్మానికి ప్రాముఖ్యం ఇవ్వడం లేదు".** అందుకే కష్టాలు పాలవుతున్నారు. అందుచేత ఆలోచించండి. **"ధర్మాన్ని రక్షించండి తప్పకుండా అది మిమ్మల్ని రక్షిస్తుంది".** అందుకే 'ధర్మో రక్షతి రక్షితః' అన్నారు. **"మానవుల్ని కాపాడగలిగింది, మానవుడు కాపాడవలసింది ధర్మం ఒక్కటే".** అందుచేత ఆలోచించండి ధర్మాన్ని కాపాడండి.

మరి ధర్మాన్ని కాపాడాలన్నా, ధర్మాన్ని ఆచరించాలన్నా ఆ శక్తి కావాలన్నా ధ్యానం చేయవలసిందే. ధ్యానం చేస్తేనే ధర్మాల్ని తెలుసుకోగలుగుతారు. ఆచరించ గలుగుతారు.

## ప్రకృతి పట్ల మానవుల ధర్మం!

మానవుల ధర్మాలలో ఒక ముఖ్య ధర్మం 'ప్రకృతిని కాపాడే ధర్మం'. ఆ **"ధర్మాన్ని మనం కాపాడితే! ఆ ధర్మమే మనల్ని కాపాడుతుంది". అంటే "ప్రకృతిని మనం కాపాడితే! ఆ ప్రకృతే మనల్ని కాపాడుతుంది!".** అందుచేత ఈ విషయం

కొంచెం ఆలోచిద్దాం.

ముందు 'ప్రకృతి' అంటే ఎవరో తెలుసుకోవాలి. ఒక రకంగా ప్రకృతి అంటే 'భగవంతుడే'. కారణం ప్రకృతిలో పంచ భూతాలు ఉన్నాయి. అవి "భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం". ఇవన్నీ భగవంతుని నుంచే ఏర్పడ్డాయి. అలాగే సకల చరాచర సృష్టి, పంచభూతాల నుండి ఏర్పడ్డాయి. అందుచేత ప్రకృతిలో వుండే సకల జీవులు, ప్రాణులు కూడా ప్రకృతిలో భాగమే, అంటే భగవంతుడే.

అన్నీ భగవంతుడే కనుక మనం ప్రకృతిని ప్రేమించాలి, ప్రేమతో చూడాలి, స్నేహం చెయ్యాలి, సహ జీవనం చెయ్యాలి. ప్రకృతి నిర్ణయాలు గౌరవించాలి, కాపాడాలి. అంతేకాని ప్రకృతిని నాశనం చెయ్యకూడదు, ద్వేషించకూడదు, హింసించకూడదు, భాధించకూడదు, ప్రకృతి నిర్ణయాలను విమర్శించకూడదు. ఇదీ ప్రకృతి పట్ల మానవుల ధర్మం. దీనికి విరుద్ధంగా ప్రవర్తిస్తే... ప్రకృతి విరుద్ధంగా ప్రవర్తించినట్లే. అంటే భగవంతునికి విరుద్ధంగా ప్రవర్తించినట్టే. అటువంటి వారు దాని ఫలితం అనుభవించవలసి వస్తుంది.

కానీ మానవులు ఇది గుర్తించక తమ స్వార్థం కోసం, తుచ్ఛమైన తమ కోరికలు నెరవేర్చుకోవడం కోసం ప్రకృతిని, ప్రకృతిలోని జీవులను నిత్యం ఎన్నో రకాలుగా హింసిస్తున్నారు. ప్రతీరోజు తమ రుచి కోసం ఎన్నో లక్షల జంతువులను క్రూరంగా చంపి భక్షిస్తున్నారు. రక్తపాతం సృష్టిస్తూ ప్రకృతికి బాధ కలిగిస్తున్నారు. చెట్లను, అడవులను తమ ఇష్టానుసారం నరుకుతూ నాశనం చేస్తున్నారు. జంతువుల మధ్య పోటీలు పెట్టి, అవి బాధపడుతుంటే తాము వినోదిస్తున్నారు. పక్షులను, చిలుకలను పంజరాలలో బంధించి, చేపలను తొట్టెలలో వుంచి, తమ ఆనందం కోసం వాటికి స్వేచ్ఛ లేకుండా చేస్తున్నారు... అంతకన్నా ఆలోచించడం లేదు.

అంతే కాదు సాటి మానవులను, బలహీనులను, స్త్రీలను హింసిస్తున్నారు, దౌర్జన్యం చేస్తున్నారు. అమాయకులను, సామాన్యులను మోసగిస్తున్నారు. అలా ఎక్కడ చూసినా ప్రకృతి మీద హింస, దౌర్జన్యాలు పెరిగిపోయాయి. మోసాలు, గుండాయిజం పెరిగిపోయాయి. ఎవరికి వారు తమ గురించి చూసుకుంటు న్నారు కానీ ఇతరుల గురించి ఆలోచించడం లేదు. అందరూ తమ లాంటి వారే. అన్ని జంతువులు తమ లాంటివేనని ఆలోచించడం లేదు. అన్నీ ప్రకృతిలోని భాగమేనని తెలుసుకోవడం లేదు. అలా ప్రకృతి మీద హింస రోజు రోజుకూ అనేక రకాలుగా పెరిగిపోయింది. ఎవరూ ప్రకృతి గురించి ఆలోచించడంలేదు. కానీ ఆలోచించాలి.

ఎందుచేతనంటే ప్రకృతి మానవులకు తల్లిలాంటిది. తల్లివడిలో బిడ్డలా మానవులు ప్రకృతి వడిలో జీవిస్తున్నారు. మనమంతా ప్రకృతికి తల్లి వడిలో వుండే

పసిపిల్లలలాంటి వారం. పిల్లలకు తల్లి అన్ని అవసరాలు ఎలా చూస్తుందో ప్రకృతి తల్లి మనకు అన్నీ సమకూరుస్తుంది. మన అవసరాలకు, ఆనందాలకు కావలసినవన్నీ సమకూరుస్తుంది.

తల్లిపాలు త్రాగితే తల్లి ఆప్యాయంగా నిమురుతుంది. కానీ తల్లిపాలు త్రాగుతూ రొమ్ము కొరికితే, గుద్దితే తల్లి ఆగ్రహిస్తుంది. దండిస్తుంది. పిల్లవాని చర్యలు మితి మీరితే పాలే ఇవ్వనంటుంది. అపుడు పిల్లవాడు తల్లడిల్లుతాడు.

అలాగే ప్రకృతిలోని సంపదలు మన అవసరాలకు వినియోగించుకుంటే ప్రకృతి సంతోషిస్తుంది. కానీ మనం విపరీత చేష్టలు అంటే జీవహింస, మాంసభక్షణ లాంటివి చేస్తే, ప్రకృతి తన ఆగ్రహాన్ని వైపరీత్యాల ద్వారా అంటే భూకంపాలు, వరదలు, సునామీలు, తుఫానులు, అడవుల దహనం లాంటి వాటి ద్వారా మనకు బుద్ధి చెబుతుంది. వర్షాలు పడవు, కరువు కాటకాలు ఏర్పడతాయి. మానవులు తల్లడిల్లుతారు. అందుచేత భూమి మీద వున్న చరాలు కానీ, అచరాలు కానీ ప్రకృతిలో భాగమేనని, వేటినీ హింసించకూడదని తెలుసుకోవాలి. అన్నిటినీ ప్రేమించాలి. అవసరాలకు మాత్రమే ఉపయోగించుకోవాలి. అంతవరకే పరిమితమవ్వాలి.

**“ప్రకృతి వైపరీత్యం అంటే మానవుల బాధలు సహించలేని, ఓర్చుకోలేని ప్రకృతి తల్లి ఆగ్రహించడమే, తన బిడ్డలను శిక్షించడమే, వారికి బుద్ధి చెప్పడమే”.** ప్రకృతి వైపరీత్యాలు వస్తున్నాయంటే మానవులు ప్రకృతి పట్ల తమ ధర్మం నిర్వర్తించడం లేదనే అర్థం. అందుచేత మానవులు ఈ విషయం గురించి ఆలోచించాలి.

## సృష్టికర్త గురించి ఆలోచించాలి!

ముఖ్యంగా ఈ సృష్టిని సృష్టి చేసిన సృష్టికర్త కూడా వున్నాడన్న సంగతి మర్చిపోకూడదు. కారణం సృష్టికర్తే లేకపోతే అసలు ఈ సృష్టి ఎలా వస్తుంది? ఈ సృష్టిలోని 84 లక్షల జీవులు, జీవరాసులు ఎలా వస్తాయి? వాటిలో భాగమైన, మనం వుంటామా? అందుచేత సృష్టి కర్త గురించి కూడా ఆలోచించాలి.

ఈ సృష్టి కర్తనే పలువురు పలు రకాలుగా పిలుచుకుంటారు. ముస్లింలు “అల్లా” అంటారు. క్రిష్టియన్లు “తండ్రి” అంటారు. హిందువులు రకరకాల పేర్లతో పిలుస్తారు. ‘భగవంతుడు’ అంటారు. ఇంకా ‘పరబ్రహ్మ’, ‘పరమాత్మ’, ‘పరమేశ్వరుడు’, ‘సృష్టికర్త’, ‘విశ్వాత్మ’ అంటారు. ఇంకా ‘ఆదిశక్తి’ అని, ‘పరాశక్తి’ అని, ‘లలితాదేవి’ అని, ఇలా రకరకాల పేర్లతో పిలుస్తూ వుంటారు. ఎవరు ఏ పేరుతో పిలిచినా మొత్తం మీద ఈ సృష్టిని సృష్టి చేసిన సృష్టికర్త అంటే ‘భగవంతుడు’ వున్నాడని తెలుస్తుంది కదా?

అందుచేత 'భగవంతుడు' వున్నాడు కాబట్టి ఆయన గురించి, ఆయన శక్తి గురించి ఆలోచించాలి.

మానవులు **"ప్రాముఖ్యం లేని విషయాల గురించి ఎంతో ఆలోచిస్తారు. కానీ సృష్టిలో అన్నిటి కంటే గొప్పవాడైన 'భగవంతుని' గురించి అసలు ఆలోచించడమే లేదు".** మానవుల దుఃఖానికి ఇదొక కారణం.

కాని ఎన్ని పొందినా... ఎన్ని సాధించినా... అన్నిటికంటే భగవంతుని గురించి ఆలోచించడం, తెలుసుకోవడం చాలా చాలా ముఖ్యం. కారణం అవన్నీ అశాశ్వతం, భగవంతుడే శాశ్వతం. అంతేకాదు అవన్నీ దుఃఖాల్ని పెంచేవే కానీ, తగ్గించలేవు, లేకుండా చెయ్యలేవు. కానీ భగవంతుని పొందితే దుఃఖాన్ని నివారించుకోవచ్చు. శాశ్వతంగా బయటపడవచ్చు. అందుచేత భగవంతుని గురించి తెలుసుకుందాం. భగవంతుని గురించి తెలుసుకోవాలంటే కొన్ని ప్రశ్నలు వేసుకోవాలి. వాటికి సమాధానాలు తెలుసుకోవాలి, వాటి గురించి అధ్యయనం చెయ్యాలి, బాగా ఆలోచించాలి, పూర్తిగా అర్థం చేసుకోవాలి, ఆచరించాలి. అలాంటి వారి జీవితమే ధన్యం, వారి జన్మే సార్థకం.

ముఖ్యంగా భగవానుని ఇష్టపడేవారు, భగవానుని ఆరాధించడానికి ప్రాముఖ్యం ఇచ్చేవారు. ఈ క్రింది ప్రశ్నలు వేసుకోవాలి. వాటి గురించి ఆలోచించాలి.

1) భగవానుడు ఉన్నాడు అంటారు. కానీ భగవానుడు ఎందుకు వున్నాడో? ఆలోచించాలి.
2) భగవానుడంటే నాకు ఇష్టం, చాలా ఇష్టం అంటారు. కానీ భగవానునికి తాము ఇష్టులైనారా? అన్నది ఆలోచించాలి. ఏమి చేస్తే? ఎలా ఉంటే? భగవానునికి ఇష్టులవుతారో ఆలోచించాలి.
3) ఎంతసేపూ భగవానుని ఆరాధించే విషయంలో, అలాగే మిగతా విషయాలలో తమకు నచ్చినట్లు, తమకు ఇష్టమైనట్టు చేస్తున్నారు, కానీ తాము చేసే పనులు భగవానుడు మెచ్చుతున్నాడా? అన్నది ఆలోచించాలి!
4) ఎంతసేపూ పూజ చేస్తే, ఆనంద పడతాడని భావిస్తున్నారు, పూజ చెయ్యటానికి ప్రాముఖ్యం ఇస్తున్నారు. కానీ భగవానుడు దేనికి ఆనందపడతాడు? అన్నది ఆలోచించాలి!
5) భగవానునికి పుష్పాలు సమర్పిస్తారు. కానీ ఆయనకు ఏ పుష్పాలు ఇష్టమో ఆలోచించాలి.
6) ఇంతకీ భగవానుడు ఎలా వుంటాడు? ఎక్కడ వుంటాడు? ఏం చేస్తూ

వుంటాడు? అన్నది ముఖ్యంగా ఆలోచించాలి!

7) ఎంతసేపూ భగవానుని కోరుతున్నారు కానీ, భగవానుని గురించి తెలుసుకోవడానికి ప్రయత్నించడం లేదు, ఆయన గురించి ఆలోచించడం లేదు.

8) ఎంతసేపూ భగవానుని కోరడానికి గంటలు, గంటల సమయం కేటాయిస్తున్నారు, వెచ్చిస్తున్నారు. కానీ భగవానుని గురించి తెలుసుకోవడానికి, ఆలోచించడానికి రోజులో కనీసం ఒక గంట అయినా కేటాయించగలుగుతున్నామా? అన్న విషయం ఆలోచించాలి.

9) ఎంతసేపూ భగవానుని ఆరాధిస్తున్నారు కానీ, భగవానుడు చెప్పింది ఆచరించడం లేదు. మరి ఆచరించాలి కదా? ఎందుకు ఆచరించడం లేదు అన్న విషయం ఆలోచించాలి.

10) ఎంతసేపూ భగవానుడు గొప్పవాడంటారు. కానీ అంతటి గొప్పవాడు చెప్పినవి గొప్పవే కదా? వాటిని ఎందుకు ఆచరించరు? ఆచరించడానికి ఎందుకు ప్రయత్నించరు అన్న దాని గురించి ఆలోచించాలి.

11) ఎంతసేపూ భగవానుని ప్రార్థించడం కాదు ఆయన చెప్పింది పాటించడం గురించి ఆలోచించాలి.

12) భగవానుడు కోరికలు తీర్చేవాడని, కష్టాలు తొలగించేవాడని, పాపాలు క్షమించేవాడని ఆరాధిస్తారు. కానీ భగవానుడు కోరికలు తీర్చేవాడా? కష్టాలు తొలగించేవాడా? పాపాలు క్షమిస్తాడా? అన్నది ఆలోచించాలి.

13) భగవానుడు అల్పమైన కానుకలు ఆశిస్తాడని భావిస్తారు. కానీ అసలు సృష్టి అంతా ఆయనదైనపుడు, సృష్టిలోనివన్నీ ఆయనవైనపుడు ఆయనకు ఎవరు ఏమి ఇవ్వగలరన్న విషయం ఆలోచించాలి.

14) ఆయనను పొగడ్తలతో, స్తోత్రాలతో వశం చేసుకోవచ్చని భావిస్తారు, కానీ అసలు ఆయన దేనికి వశుడవుతాడు? అన్న విషయం ఆలోచించాలి.

15) భగవానుని మందిరాలలో, గుళ్ళలో ఉంచామని భావిస్తారు. అక్కడే పవిత్రంగా వుంటారు. కానీ ఆయన సర్వాంతర్యామి అన్న విషయం గురించి ఆలోచించాలి. అన్ని చోట్ల పవిత్రంగా ఉండాలన్న దాని గురించి కూడా ఆలోచించాలి.

16) లోకంలో రూపాన్ని సరిచేసుకుని అంటే బాహ్యశుద్ధి చేసుకుని గుడికి వెళతారు. కానీ భగవంతుడు ప్రాముఖ్యం ఇచ్చేది రూపానికా? గుణానికా? అంటే బాహ్యశుద్ధా? అంతర్‌శుద్ధా అన్న విషయం ఆలోచించాలి?

16) భగవానుని ఆరాధిస్తే అనుగ్రహిస్తాడని, ఆరాధించకపోతే ఆగ్రహిస్తాడని

భావిస్తారు. కానీ ఆయన అలా ప్రవర్తిస్తాడా? ఆయనకు ఆగ్రహ అనుగ్రహాలు వున్నాయా? అన్న విషయాలు ఆలోచించాలి.

16) అసలు ఆరాధన అంటే ఏమిటి? ఎలాంటి ఆరాధన చెయ్యాలి? అన్నది ఆలోచించాలి.

17) భక్తి అంటే ఏమిటి? దేనిని భక్తి అంటారు? అన్న విషయం ఆలోచించాలి.

18) భగవానుని కోరితే ముక్తి రాదు! చేరితేనే ముక్తి వస్తుందన్న విషయం కూడా ఆలోచించాలి.

19) భగవానుని చేరాలంటే ముందు ఆయన ఎవరో తెలుసుకోవాలి కదా? ఎక్కడ వుంటాడో? ఎలా చేరాలో తెలుసుకోవాలి కదా? ఈ విషయాలన్నీ ఆలోచించాలి.

20) భగవానుని గురించి తెలుసునన్నట్లుగా మాట్లాడతారు. అసలు ఆయన గురించి ఎంత తెలుసు? అన్న విషయం కూడా ఆలోచించాలి.

ఇలా మనం చెప్పుకుంటూపోతే భగవానుని గురించి ఆలోచించ వలసినవి, తెలుసుకోవలసినవి ఎన్నో వున్నాయి. కారణం ఆయన అంత గొప్పవాడు కనుక. ఒక రకంగా చెప్పాలంటే భగవానుని గురించి పూర్తిగా తెలుసుకోవడం ఎవరికైనా అసాధ్యం. కానీ కొంచెమైనా తెలుసుకోవాలి. ఆయన గురించి కొంతైనా అవగాహన చేసుకోవాలి. అంతే కానీ ఏమీ తెలుసుకోకుండా, ఏమీ ఆలోచించకుండా చేసే పనులు, ఆరాధనలు వ్యర్థమవుతాయి. దుఃఖాన్ని తొలగించడం కాదు దుఃఖాన్ని పెంచుతాయి కూడా! అందుచేత భగవానుని గురించి ఆలోచించడం చాలా చాలా ముఖ్యం.

అలాగే శ్రీ కృష్ణ భగవానుడు భగవద్గీత ద్వారా అద్భుతమైన సందేశాన్ని మానవలోకానికి బోధించాడు. మానవులు దుఃఖం నుంచి బయటపడటానికి, ఆనందంగా జీవించడానికి, అసలు మానవ జీవితం దేనికి? మానవులు ఏమి చెయ్యాలి? జీవిత లక్ష్యమేమిటి? ఏమి చేస్తే శాశ్వత ఆనందాన్ని పొందగలరు? లాంటివెన్నో విషయాలు భగవానుడు బోధించాడు. మానవులు తప్పనిసరిగా వీటన్నిటి గురించి ఆలోచించాలి. అసలు ఆయన బోధించిన భగవద్గీత ప్రతి ఇంట్లో వుండాలి, అధ్యయనం చెయ్యాలి, అర్థం చేసుకోవాలి, ఆచరించాలి. ముఖ్యంగా ఆయన చెప్పిన దాని గురించి ఆలోచించాలి.

కారణం భగవానుడు బోధించిన దాని కంటే గొప్ప విషయాలు ఎవరు బోధించగలరు? ఆయన బోధించినవన్నీ అక్షరసత్యాలే కదా? మరి ఆయన చెప్పిన దాని గురించి ఆలోచించడం లేదంటే ఆయనను నిర్లక్ష్యం చేసినట్టే. ఇది మనకే

నష్టం. అందుచేత ఆలోచించండి.

## భగవంతుడు చెప్పింది! - మానవుడు చేసేది!

భగవంతుని గురించి ఇంకా కొన్ని విషయాలు ఆలోచిద్దాం. ఎందుచేతనంటే భగవంతుని ఆరాధించే వాడి కంటే భగవంతుడు చెప్పింది ఆచరించే వాడే గొప్పవాడు. ఇది ఆలోచిస్తే తెలుస్తుంది. మరి భగవంతుడు ఏమి చెప్పాడు? అసలు మనం ఏమి చేస్తున్నాం? అన్నది కొంచెం తెలుసుకుందాం.

అంతేకాదు మానవుడు జీవితంలో దుఃఖం వద్దనుకుంటాడు. దుఃఖం రాకూడదనుకుంటాడు. కాని విచిత్రమేమిటంటే మానవుడు కోరుకుని, ప్రయత్నించి, అమర్చుకున్న సుఖాలు అనుభవించలేకపోతు న్నాడు. కోరుకోని, ప్రయత్నించని దుఃఖాన్నే అనుభవిస్తున్నాడు. అంటే కావాలన్నది పొందటం లేదు. వద్దన్నదే అనుభవిస్తున్నాడు.

మానవుడు అనుకున్న దానికి విరుద్ధంగా జరగటానికి ముఖ్యకారణం, భగవంతుడు చెప్పింది ఒకటైతే మానవుడు చేసేది మరొకటి. భగవంతుడు చెప్పిన దానికి విరుద్ధంగా చేస్తే... విరుద్ధమైన ఫలితాలు రాక ఏమవుతాయి? అందుచేత భగవంతుడు చెప్పిందే, మానవులు చెయ్యాలి. అపుడే జీవితం, ఆనందంగా వుంటుంది. మరి భగవంతుడు ఏమి చెప్పాడు? మానవుడు ఏమి చేస్తున్నాడు? అన్న విషయాలు కొన్ని తెలుసుకుందాం.

శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీత ద్వారా ఏమి చెయ్యాలో మనకు స్పష్టంగా చెప్పారు. మనం కూడా అదే చెయ్యాలి. మరి గీతలో భగవంతుడు ఏమి చెప్పాడు? మానవుడు ఏమి చేస్తున్నాడు?

1. ఆయన ఎవరిని వారే ఉద్ధరించుకోమంటే, మానవుడు ఆయననే ఉద్ధరించ మంటాడు, (భ॥గీ॥6-5)
2. ఆయన మరణానంతర జీవితం ఉందంటే, మానవుడు ప్రస్తుతం ఉన్నదే జీవితమన్నట్టుగా ప్రవరిస్తున్నాడు. (భ॥గీ16-5)
3. ఆయన యోగికమ్మంటే, మానవుడు భోగిగా తయారవుతున్నాడు.(భ॥గీ16-46)
4. ఆయన నేను ఆత్మను అంటే, మానవుడు విగ్రహమే ఆయన అంటాడు. (భ॥గీ10-20)
5. ఆయన నేను అన్ని జీవులలోను వున్నాను అంటే మానవుడు ఆయన అన్ని గుళ్ళలోను వున్నాడంటారు. (భ.గీ.10-20)
6. ఆయన అందరూ నేనే, అంతా నేనే, అన్నీ నాలోనే వున్నాయి, అంతా నాలోని భాగాలే, అంటే మానవుడు తాను వేరు ఇతరులు అంటే ఇతర మానవులు,

ఇతర జంతువులు వేరు అనుకుంటాడు, వేరుగా ప్రవర్తిస్తాడు. (భ.గీ.11-5)

7. ఆయన ఇతరుల కష్టం తన కష్టంగా భావించమంటే, మానవుడు తన ఆనందం కోసం ఇతరులను, ఇతరజీవులను కష్టపెడుతున్నాడు. (భ॥గీ16-32)
8. ఆయన మానవునకు చావు లేదంటే,మానవుడు తాను చనిపోతాను అనుకుంటాడు, భయపడతాడు. (భ.గీ.2-20)
9. ఆయన చనిపోయిన వారి గురించి కాని, చనిపోబోయే వారి గురించి కాని దుఃఖించవద్దు అంటే, మానవుడు వారి గురించే దుఃఖిస్తాడు.(భ॥గీ12-11)
10. ఆయన శీతోష్ణాలకు, సుఖదుఃఖాలకు, మానావ మానాలకు చలించవద్దు అంటే, మానవుడు చలించిపోతాడు. (భ.గీ.2-38)
11. ఆయన గుణాలు సరిచేసుకోమంటే, మానవుడు రూపాన్ని సరిచేసుకోవటానికి ప్రాముఖ్యం ఇస్తాడు.
12. ఆయన కర్మ చెయ్యడానికే నీకు అధికారం వుంది కాని, ఫలితం ఆశించడానికి అధికారం లేదు అంటే ఫలితాలు ఆశించే పూజాది కర్మలు చేస్తున్నాడు. (భ॥గీ12-7)
13. ఆయన ప్రతిఫలం ఆశించకుండా చెయ్యమంటే మానవుడు కోరికల గురించే అంటే ఫలం ఆశించే చేస్తున్నాడు. (భ॥గీ॥ 12-12)
14. ఆయన గుణాలనే ప్రేమ పుష్పాలు సమర్పించమంటే, మానవుడు మామూలు పుష్పాలు సమర్పిస్తాడు. ఆయన మంచి పనులనే ఫలాలు సమర్పించమంటే, మానవుడు మామూలు ఫలాలు సమర్పిస్తాడు. మంచి ఆలోచనలనే పత్రాలు సమర్పించమంటే, మానవుడు మామూలు పత్రాలు సమర్పిస్తాడు. ఆయన నిర్మల మనస్సనే ఉదకాన్ని సమర్పించమంటే, మానవుడు ఉత్తనీరు సమర్పిస్తాడు. (భ.గీ.9-26)
15. ఆయన ఆత్మే నేను అనే భావంలో వుండమంటే, మానవుడు దేహమే నేను అనే భావంలో వుంటాడు. (భ॥గీ॥ 10-20)
16. ఆయన జీవహింస చెయ్యవద్దంటే, మానవుడు జీవహింస చేసి మాంసభక్షణ చేస్తున్నాడు (భ॥గీ16-20)
17. ఆయన తాబేలులా ఇంద్రియాలను అంతర్ముఖం చెయ్యమంటే, మానవుడు ఎంతసేపు ఇంద్రియాల తో బహిర్ కార్యాలే చేస్తున్నాడు.(భ॥గీ॥ 2-58)
18. ఆయన నేను చేస్తున్నాను అనే భావం అంతే కతృత్వ భావం లేకుండా చెయ్యమంటే మానవుడు అన్నీ నేనే చేస్తున్నాను అనుకుంటాడు, అంటాడు.

19. ఆయన మరణ సమయంలో ఏ భావంలో వుంటే అదే పొందుతావు అంటే, మానవుడు ఆత్మ భావంలో అంటే భగవంతుని భావంలో కాకుండా ప్రాపంచిక భావంలో వుంటున్నాడు. మరల, మరల జన్మలు పొందుతున్నాడు. (భ।గీ।8.6)
20. ఆయన అన్నిటిని, అందరినీ సమానంగా భావించమంటే అందరూ అన్నీ వేరు, వేరు అని భావిస్తున్నారు. (భ.గీ.5-18)
21. ఆయనఅన్నిటి కంటే కర్మ ఫల త్యాగం గొప్పదంటే మానవుడు చేసిన కర్మకు ఫలితం కోరుకుంటాడు. అసలు కోరికల గురించే ఆ కర్మలు చేస్తాడు. (భ॥గీ॥4-20)
22. ఆయనను దర్శించాలంటే దివ్యనేత్రం సంపాదించుకోవాలి, కానీ మానవుడు భౌతిక నేత్రాలతో విగ్రహాన్ని దర్శించుకుని భగవంతుని దర్శించానను కుంటాడు. (భ.గీ.11-8)
23. ఆయనను ఏ విధంగా భావిస్తే ఆ విధంగానే అనుగ్రహిస్తాను అంటే, మానవుడు తాను అల్పుడనుకుంటూ భగవంతుని యాచిస్తున్నాడే కాని తాను కూడా ఆయనలోని అంశే అని సమానమని, స్నేహభావంతో ప్రవర్తించడం లేదు.

పై విషయాలన్నీ ఆలోచిస్తే భగవద్గీత ద్వారా భగవానుడు బోధించింది ఒకటి మానవులు ఆచరించేది ఒకటి. అందుకే కష్టాలు. అందుచేత ఆలోచించండి భగవానుడు బోధించింది ఆచరణలో పెట్టండి.

## భగవంతుని శక్తి అపారం - అనంతం

అంతేకాదు మానవుడు భగవంతుని గురించి, భగవంతుని శక్తి గురించి తెలుసుకోకుండా ఆయన శక్తిని తక్కువగా అంచనా వేస్తూ ఆయనను సామాన్య మానవునిగా భావిస్తూ ఆయన శక్తికి తగ్గట్టు ప్రవర్తించడం లేదు. ఆయన శక్తిని తగ్గించి ప్రవర్తిస్తున్నాడు. అలా ప్రవర్తించడం ఒక రకంగా ఆయనను అవమానించడమే అవుతుంది కానీ గౌరవించడమవ్వదు. ఈ విషయమే ఆయన ఈ క్రింది శ్లోకం ద్వారా చెప్పడం జరిగింది.

**శ్లో॥ అవజానన్తి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్।**
**పరం భావ మజానన్తో మమ భూతమహేశ్వరమ్ ॥ (భ.గీ.9-11)**

తా:- నా యొక్క పరమతత్వమును ఎరుగని మూఢులు, సమస్త ప్రాణులకు నియామకుడనగు నన్ను, మనుష్య దేహమును ధరించిన వానినిగా భావించి, నన్ను అవమానించుచున్నారు.

చూడండి సర్వాంతర్యామి, సర్వవ్యాపి అయిన భగవంతుణ్ణి ఏదో గుళ్ళల్లో మాత్రమే ఉన్నట్టుగా భావించడం, అలాగే ప్రవర్తించడం ఆయన శక్తిని తక్కువగా

భావించడమే కానీ, శక్తికి తగ్గట్టు ప్రవర్తించినట్టు ఎలా అవుతుంది?

అంతేకాదు ఎవరి ప్రవర్తన చూసినా, గుడికి వెళ్ళినపుడు విగ్రహం ఎదురుగా వున్నప్పుడు మాత్రమే పవిత్రంగా వుంటుంది. బయట, మిగిలిన సమయంలో వారి ప్రవర్తన అలా వుండదు. కారణం ఆయన గుళ్ళలోనే వుంటాడని భావించడం వల్ల. ఇది ఆయన శక్తికి తగ్గట్టు ప్రవర్తించడమెలా అవుతుంది? ఆయన శక్తిని అవగాహన చేసుకున్న వారు అన్ని చోట్ల పవిత్రంగా వుంటారు. అన్నిట్లలో, అందరిలో దైవాన్ని చూడగలుగుతారు.

గుడికి వెళ్ళినపుడు కోరికలు మనస్సులో కోరుకుంటారు. కారణం మనస్సులో అనుకున్నా తెలుసుకోగల శక్తి భగవంతునికి వుందని. ఆలోచించండి మనస్సులో అనుకున్నా తెలుసుకోగల శక్తి వున్నపుడు మన మనస్సులోని కోరికలు ఆయనకు తెలియవా? మరల ప్రత్యేకించి కోరడమెందుకు? అలా కోరుతున్నామంటే ఆయన శక్తిని తక్కువగా భావిస్తున్నట్టేగా? ఇంకా ఆలోచించండి అన్నీ తెలుసుకోగల శక్తి వున్న భగవంతునికి మన కోరికలు చెప్పుకోవడానికి మధ్యవర్తులు కావాలా? ఆయనేమైనా మధ్యవర్తులను నియమించుకున్నాడా? ఆలోచిస్తే ఇవన్నీ ఆయన శక్తికి తగ్గట్టు ప్రవర్తించడం కాదని తెలుస్తుంది.

అలాగే భగవంతుడు నిద్రపోతాడని భావిస్తూ ఉదయాన్నే సుప్రభాతం పాడతాడు. అలాగే భగవంతునికి నిద్ర అవసరం అని భావిస్తూ పవళింపు సేవలు చేస్తారు. అంతేకాని భగవంతుడు నిద్రపోతాడా? అసలు ఆయనకు నిద్ర అవసరమా? ఆయన నిద్రపోతే లోకాలన్నీ ఏమవుతాయి? అన్నవి ఆలోచించరు. ఇలా చెయ్యడం ఆయన శక్తిని తగ్గించడమే అవుతుంది కానీ శక్తికి తగ్గట్టు ప్రవర్తించడం అవ్వదు.

ఆలోచించండి చావు పుట్టుకలు లేని దేవునికి ఆకలి దప్పికలు వుంటాయా? వుండవు కదా? మరి నైవేద్యాలు పెడుతున్నామంటే ఆయన శక్తిని తక్కువగా భావిస్తున్నట్టేగా?

ఇంకా ఆలోచించండి. దేవునికి మురికి అంటుతుందా? శుద్ధి చెయ్యాలా? స్నానం అవసరమా? అంటే లేదు కదా? మరి అభిషేకాలు చేస్తున్నామంటే ఆయన శక్తికి తగ్గట్టు ప్రవర్తించడం లేదు కదా?

ఆలోచించండి భగవంతునికి చెవులు వున్నాయా? చెముడు వుందా? అంటే లేదు కదా? మరి మైకులు పెట్టి అరుస్తున్నామంటే ఆయన శక్తికి తగ్గట్టు ప్రవర్తించడం లేదు కదా? శక్తిని తగ్గించి ప్రవర్తించడమే అవుతుంది.

ఇంకా ఆలోచిస్తే భగవంతుడు కానుకలు కోరుకుంటాడా? ముడుపులు

ఆశిస్తాడా? అంటే లేదని ఆయనకు ఇవేమీ అవసరం లేదని ఖచ్చితంగా చెప్పవచ్చు. కారణం ఈ సృష్టే ఆయనది. ఈ భూమి మీద సమస్త సంపదలు ఆయనవే. సమస్తమూ ఆయన సృష్టించుకున్నవే. అటువంటి వారు ఇలాంటి అల్పమైన కానుకలు ఆశిస్తాడన్నట్టుగా కానుకలు సమర్పించడం, హుండీలో డబ్బులు వేయడం లాంటి పనులు గురించి ఆలోచిస్తే ఆయన శక్తిని తగ్గించడమే అవుతుంది.

అందుచేత ఆలోచించండి. భగవంతుని శక్తిని తగ్గించకండి. ఆయనను మానవునిగా భావించకండి. ఆయన శక్తికి తగ్గట్టు ప్రవర్తించండి. భగవంతుని శక్తి అపారం. అనంతం అని తెలుసుకోండి.

భగవంతుని విషయంలో ఇంకా ఆలోచించవలసిన విషయాలు వున్నాయి. ఎవరైనా తండ్రిని కాకుండా తండ్రి ఆస్థిని కోరితే ఎలా వుంటుందో, అలాగే భగవంతుని కాకుండా ఆయన ఆస్తి అయిన సృష్టిలోనివి కోరితే అలాగే వుంటుంది. కారణం వీరంతా కోరికలతో ఆరాధిస్తున్నారు. కానీ కోరికలు లేకుండా ఆరాధించేవారు తండ్రిని కోరుతున్నట్టు అంటే సృష్టిలోనివి కాకుండా సృష్టి కర్తను అంటే భగవంతుని కోరుతున్నట్టు లెఖ్ఖ. అందుచేత ఏది ముఖ్యమో ఆలోచించండి.

ఆలోచిస్తే విశ్వం కాదు విశ్వనాధుడే గొప్పవాడని తెలుస్తుంది. విశ్వాన్ని, విశ్వంలో వున్న వాటిని కాదు ఈ విశ్వానికే నాధుడైన భగవంతుణ్ణి కోరాలి, ఆశ్రయించాలి.

ఇంకా ఆలోచించండి అంతా గుడికి వెళ్ళి వచ్చి దేవుని దర్శనం చేసుకున్నామని అంటారు. అసలు వీరు దర్శించుకున్నది ఎవరిని? దేవుణ్ణా? విగ్రహాన్నా?

ఆలోచించండి మానవులు విగ్రహాన్ని, ఫోటోలను పూజించే సమయంలోనే దేవుడుగా భావిస్తారు కానీ తరువాత దేవుడు కాదన్నట్టుగా ప్రవర్తిస్తారు. అంతేకాదు వారు దేనిని దేవుడని భావిస్తారో, ఎవరిని దేవుడని భావిస్తారో అదే దేవుడన్నట్టుగా ప్రవర్తిస్తారు. మిగిలినవి, మిగిలిన వారు దేవుడు కానట్టుగా ప్రవర్తిస్తారు.

గుడిలో విగ్రహం దేవుడంటారు. గుడి బయట వున్న విగ్రహాలు దేవుడు కానట్టుగా ప్రవర్తిస్తారు. గోడకు తగిలించిన ఫోటో దేవుడంటారు. శుభలేఖల మీద వున్న ఫోటోలు దేవుడు కాదన్నట్టు బయట పారేస్తారు. క్యాలెండరులో తారీఖులున్నంత వరకు దేవుడని మొక్కుతారు. తారీఖులు అయిపోతే క్యాలెండరు బయట పారేస్తారు. ఆలోచిస్తే ఇలాంటి ఎన్నో మనం గమనించవచ్చు.

అలాగే లోకంలో విగ్రహారాధన మూడు కారణాలతో చేస్తున్నారు. (1)విగ్రహమే భగవంతుడని భావిస్తూ ఆరాధించేవారు కొందరు, (2) విగ్రహంలో

భగవంతుడున్నాడని భావిస్తూ ఆరాధించేవారు కొందరు, (3) విగ్రహాన్ని ఆరాధిస్తే భగవంతుణ్ణి ఆరాధించినట్టేనని భావిస్తూ ఆరాధించేవారు మరికొందరు.

కానీ ఎవరు ఏ రకంగా ఆరాధిస్తున్నా ఇక్కడ కొంచెం ఆలోచించాలి. లేకపోతే నష్టపోయేది మనమే!

(1) విగ్రహమే భగవంతుడని భావించేవారు ఆలోచించవలసిందే మిటంటే? విగ్రహం మనమే కదా తయారు చేసింది? మరి మనం భగవంతుణ్ణి తయారు చెయ్యగలమా? ఆ శక్తి మనకు వుందా? మనం తయారు చేసింది భగవంతుడవుతాడా? అన్న విషయాలు తప్పనిసరిగా ఆలోచించాలి.

(2) అలాగే విగ్రహంలో భగవంతుడు లేడా? అని భావించే వారు కూడా ఆలోచించవలసి వుంది. విగ్రహంలో భగవంతుడు లేడా? అని ప్రశ్నిస్తున్నారంటే... విగ్రహంలో వున్నది భగవంతుడా? విగ్రహం భగవంతుడా? అని ప్రశ్నించుకుంటే విగ్రహంలో వున్న వాడే కానీ విగ్రహం భగవంతుడు కాదనేగా అర్థం.

ఇంకా ఆలోచిస్తే విగ్రహంలోనే భగవంతుడు వున్నపుడు అన్ని జీవులలో వుండడా? అన్ని ప్రాణులలో వుండడా? మరి ఏ ప్రాణిని పూజించినా భగవంతుని పూజించినట్టేగా? మరి విగ్రహాన్ని తప్ప మిగతా వాటిని ఎందుకు పూజించం? కనీసం ఎందుకు గౌరవించం? ఎందుకు హింసించకుండా వుండం? ఇవన్నీ ఆలోచించాలి కదా?

విగ్రహాన్ని పూజిస్తే భగవంతుని పూజించినట్లైనపుడు... ఏ ప్రాణిని హింసించినా భగవంతుని హింసించినట్లే కదా? ఏ మానవుని అవమానించినా, బాధించినా, నష్టపరచినా, కష్టపెట్టినా భగవంతుని బాధించినట్టేగా? అవమానించినట్టేగా? మరి ఎందుకు ఇవన్నీ చేస్తున్నాం? ఇవన్నీ ఆలోచించాలి కదా? మరి విగ్రహంలో భగవంతుడు వున్నపుడు అన్ని విగ్రహాలలో కూడా వుంటాడుగా? అంటే అన్ని విగ్రహాలలో వున్నది ఒక్కడేగా? మరి కొన్ని విగ్రహాలను ఆరాధించి కొన్నిటిని ఎందుకు ద్వేషిస్తున్నాం? అలా కొన్ని రూపాలను ద్వేషిస్తున్నామంటే లోవున్న వాడిని చూడనట్టేగా?

ఇంకా ఆలోచిస్తే విగ్రహంలో దేవుడు వున్నపుడు విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ట ఎందుకు చేస్తున్నారు? ప్రాణ ప్రతిష్ఠ చెయ్యకపోతే ఆరాధనకు అర్థం కాదని ఎందుకు అంటారు?

అలాగే ఆలోచిస్తే ఈ ప్రాణ ప్రతిష్ఠ విషయంలో కూడా ఎన్నో ప్రశ్నలు ఉదయిస్తాయి. అసలు ప్రాణ ప్రతిష్ఠ అంటే ఏమిటి? విగ్రహంలో ప్రాణాన్ని

ప్రతిష్టించడం అంటే ప్రాణాన్ని పోయడమని చెబుతారు. ఇక్కడ కూడా ఆలోచిస్తే ప్రాణమే భగవంతుడు కానీ విగ్రహం కాదని తెలుస్తుంది కదా?

ఇక్కడ ఇంకా ఆలోచిస్తే ప్రాణం లేని దానికి ప్రాణం పొయ్యడమెందుకు? ప్రాణమున్న దాన్నే ఆరాధించవచ్చు కదా? ఇక్కడ విచిత్రమేమిటంటే ప్రాణమున్న వాటిని హింసిస్తున్నారు, చంపుతున్నారు, భక్షిస్తున్నారు. ప్రాణం లేని వాటికి ప్రాణం పోశామని చెప్పి ఆరాధిస్తున్నారు. ఎంత విచిత్రమో ఆలోచించండి.

ఇంకా ఆలోచించండి ప్రాణ ప్రతిష్ఠ చేసామంటారు. మరి ప్రాణం పోశారా? లేదా? ఇది ఎలా తెలుస్తుంది? లేకపోతే వూరికే మంత్రాలు చదివారా? ఆలోచించండి. ప్రాణమున్న ప్రతీది కదులుతుంది కదా? మరి ప్రాణం పోసినపుడు విగ్రహం ఎందుకు కదలటం లేదు? కదలాలిగా?

మంత్రాలు చదివితే ప్రాణం పోసినట్లయితే అవే మంత్రాలు చదివి ప్రాణం పోయిన వారిని బ్రతికించ వచ్చు కదా? అలా ఎందుకు చెయ్యరు? ఎందుకు ఏడుస్తారు? రోదిస్తారు? బాధపడతారు?

అందుచేత భగవంతుని విషయంలో ఆలోచించవలసినవి ఎన్నో వున్నాయి. అలా ఆలోచించకుండా చేసే పనుల వల్ల నష్టపోయేది మనమే. తెలుసుకోండి భగవంతుడు వున్నాడు. వుండటమే కాదు. ఆయన చాలా చాలా శక్తి గల వాడు, గొప్పవాడు. ఇది ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. అందుచేత భగవంతుని బట్టి మనముండాలి. అంతేకానీ ఆయన మనం భావించినట్టు మాత్రం వుండడు.

3) అలాగే కొంతమంది ఏమంటారంటే అదేమి కాదు కానీ నేను విగ్రహాన్ని ఆరాధిస్తే భగవంతుణ్ణి ఆరాధించినట్టుగా భావిస్తున్నాను. "యద్భావం తద్భవతి" అంటారుగా అని చెబుతారు.

కానీ ఇక్కడ కూడా ఆలోచించవలసింది వుంది. చిన్న ఉదాహరణ చూద్దాం. మీరు చీకట్లో వెళ్ళేటపుడు దారిలో 'తాడు' పడి వుంది. మీరు దానిని 'పాము' అని భావించారు. భయపడి కేకలు పెట్టారు. అలా మీరు తాడును చూసి పాము అని భావించినంత మాత్రాన ఆ తాడు పాము అయిపోతుందా? మీరు కేకలు పెట్టినా అది వచ్చి మిమ్మల్ని కరుస్తుందా? ఆలోచించండి. అలాగే విగ్రహాన్ని మీరు దేవుడని భావించినంత మాత్రాన విగ్రహం దేవుడు అవుతాడా? మీరు ఏమి చేసినా వచ్చి మిమ్మల్ని అనుగ్రహిస్తాడా? అది మీ భ్రాంతి మాత్రమే.

అలా మీరు కూర్చునే కుర్చీని ఇది బంగారం కుర్చీ అని భావిస్తే అది బంగారం కుర్చీ అయిపోతుందా? అలాగే ఎవరిదో బంగళా మీదని భావిస్తే

మీది అయిపోతుందా? అందుచేత తెలుసుకోండి. భావం... భావమే? సత్యం... సత్యమే?

అందుచేత భగవంతుని విషయంలో భావానికి కాకుండా సత్యానికి ప్రాముఖ్యం ఇవ్వాలి. సత్యం తెలుసుకోవాలి. సత్యాన్ని ఆశ్రయించాలి. కారణం సత్యమే భగవంతుడు. అంతేకానీ భగవంతుడు నీ భావాన్ని బట్టి వుండడు. ఎందుచేతనంటే భావం మారుతూ వుంటుంది. మనిషి మనిషికి వేరు వేరుగా వుంటుంది. కానీ సత్యం ఒక్కటే. సత్యం మారనిది. మార్పు చెందనిది. కాలం మారినా, యుగాలు మారినా మారనిది సత్యం. సత్యం నిత్యమైనది. శాశ్వతమైనది అంటే ఎప్పుడూ వుండేది. అందుచేత అటువంటి సత్యాన్ని ఆశ్రయించాలి. అంటే సత్యమైన భగవంతుణ్ణి ఆశ్రయించాలి.

ఈ సృష్టిలో ఏది సత్యం? అంటే 'ఆత్మే' సత్యం. అంటే ఆత్మే భగవంతుడు. అందుచేత ఆత్మను ఆశ్రయించాలి. ఆత్మను ఆరాధించాలి. ఆత్మ పట్ల భక్తి కలిగి వుండాలి. మరి ఆత్మ ఎక్కడ వుంది? అందరిలో వుంది. అంతటా వుంది. అందుకే భగవంతుడు సర్వాంతర్యామి అంటారు.

అందుచేత అందరిలో వున్న ఆత్మ నీలోను వుంది కాబట్టి అంతర్ముఖులవ్వాలి. అంటే ధ్యానం ద్వారా ఆశ్రయించాలి. అదే నిజమైన ఆరాధన, అదే భగవంతుణ్ణి ఆశ్రయించడం. ఇదంతా ఎంతో ఆలోచిస్తే కానీ తెలియదు. ఎంతో విచారణ చేస్తే కానీ తెలియదు.

అందుకే సత్యసాయిబాబా వారు (1) సత్యం, (2) ధర్మం, (3) ప్రేమ, (4) అహింస, (5) శాంతి ముఖ్యమని చెప్తూ ముఖ్యంగా ముందు 'సత్యం' అని చెప్పారు. సత్యానికి అంత ప్రాముఖ్యం ఇచ్చారు. ఆయన సందేశమేమిటంటే సత్యాన్ని ఆశ్రయించాలి, ధర్మాన్ని ఆచరించాలి, ప్రేమను పంచాలి, అహింసను పాటించాలి. శాంతిగా జీవించాలి – అందరినీ జీవించనివ్వాలి, ఇదే బాబా వారి సందేశం. ఈ సందేశంలోనే అంతా ఇమిడి వుంది.

అలాగే భగవంతుని గురించి ఆలోచించవలసినవి మరికొన్ని చూద్దాం.

1. భగవంతుడు సర్వాంతర్యామి అని అంటూ, ఆయన ఆలయంలో, చర్చిలో, మసీదులో మాత్రమే ఉన్నట్టుగా ప్రవర్తిస్తూండటం, మిగిలిన చోట్ల ఆయన లేనట్లుగా ఎందుకు ప్రవర్తిస్తున్నాం?
2. భగవంతుడు అందరిలో ఉన్నాడంటూ, బయట వేరే వున్నట్టుగా పూజలు, తీర్థ యాత్రలు ఎందుకు చేస్తున్నాం?
3. భగవంతుని శక్తి అపారమంటూ, ఆయనకు తెలియంది ఏదీ లేదంటూ,

పాపాలు ఎందుకు చేస్తున్నాం?

4. మనస్సులో కోరుకున్నా భగవంతునికి తెలుస్తుందని మనసులో కోరుకుంటూ, తన ఆలోచనలు, భావాలు భగవంతునికి తెలియదన్నట్లుగా దుష్ట ఆలోచనలు ఎందుకు చేస్తున్నాం?
5. మనస్సులో ఎప్పుడు, ఎక్కడ కోరుకున్నా, తెలుసుకోగల శక్తి భగవంతునికి ఉందని తెలుసు, కాని తనకు వచ్చిన కష్టాలు తెలియవన్నట్లు ప్రత్యేకించి ఎందుకు కోరుతున్నాం? ఎందుకు ప్రార్థిస్తున్నాం?
6. భగవంతుడంటే ఇష్టం, భక్తి, గౌరవం అని పూజిస్తూ, ప్రార్థిస్తూ, అంతరాత్మ రూపంలో భగవంతుడు చెప్పేది ఎందుకు వినటం లేదు.
7. భగవంతునికి తెలియంది ఏదీ లేదంటూ, ఆయన భగవద్గీత, బైబిలు, ఖురాన్‌ల ద్వారా చెప్పింది ఎందుకు ఆచరించటం లేదు?

ఇలా భగవంతుని గురించి ఎన్నో ఆలోచించాలి. అలా భగవంతుని గురించి ఎంత ఆలోచిస్తే.. ఎంత తెలుసుకుంటే మనం అంత లాభం పొందుతాం. ఆయన గురించి తెలియకపోతే మన ప్రవర్తన ఒకలా వుంటుంది. తెలుసుకుంటే మన ప్రవర్తన మరోలా వుంటుంది. అందుచేత తప్పుని సరిగా భగవంతుని గురించి బాగా ఆలోచించాలి.

## దైవభీతి కాదు– పాపభీతి వుండాలి!

ఆలోచిస్తే "మానవులకు వుండవలసింది "పాపభీతి". కాని మానవులకు వున్నది "దైవభీతి".

ఎందుచేతనంటే రోజూ పూజ చేస్తూ, ఏదైనా ఒక రోజు పూజ మానేస్తే ఎంతో భయపడతారు. కారణం పూజ చెయ్యకపోతే దేవుడు కోపిస్తాడని వారి వుద్ధేశ్యం. అలాగే వారం, వారం గుడికి వెళ్ళేవారు, ఒక వారం గుడికి వెళ్ళకపోయినా అలా దేవునికి సంబంధించి అలవాటైన పని ఏది మానేసినా ఏదైనా కీడు జరుగుతుందేమోనని భయపడతారు. కారణం గుడికి వెళ్ళకపోతే దేవునికి కోపం వస్తుందని వారి భయం.

అలా అంతా **"దేవునికి భయపడుతూ దైవభీతితో జీవిస్తున్నారు. కాని, పాపాలు చెయ్యటానికి మాత్రం భయపడడం లేదు".** అందుకే పాపాలు యధేచ్ఛగా, ధైర్యంగా చేసేస్తున్నారు.

కానీ తెలుసుకోండి మానవుడు భయపడవలసింది పాపాలు చెయ్యటానికే. కారణం, పాపాలు చేస్తేనే కష్టాలు వస్తాయి. అందుచేత ఆలోచించండి, దైవానికి భయపడాలా? – పాపాలు చెయ్యటానికి భయపడాలా?

# ధనం వుంటే చాలా?

ముఖ్యంగా మానవుడు ధనానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నాడు. ధనం వుంటే చాలు అనుకుంటున్నాడు. ధన సంపాదనకే ప్రాముఖ్యం ఇస్తున్నాడు. ఆలో చించండి ధనం వుంటే సరిపోతుందా? అందుచేత ఈ విషయం గురించి ఆలోచిద్దాం.

ఆలోచిస్తే మానవుడు ఎంత సంపాదించినా, ఎన్ని సుఖాలు సమ కూర్చుకున్నా, చివరకు దుఃఖాల పాలై ఆ సుఖాలను అనుభవించలేకపోతున్నాడు. ఎన్నో తెలివితేటలు ఉన్నాయని భావించే మానవుడు తన దుఃఖాలను మాత్రం నివారించుకోలేక పోతున్నాడు. దీనికి ముఖ్య కారణం మానవుడు 'పాప, పుణ్యాల' గురించి ఆలోచించకపోవడమే.

మానవుడు ఈ 'పాప, పుణ్యాల' గురించి ఆలోచించకుండా ఎంత ధనం సంపాదించినా తాను అనుకున్నట్టు జీవించలేడు. అంటే సుఖంగా వుండలేడు. దుఃఖం నివారించుకోలేడు. అందుచేత ముఖ్యంగా 'పాప, పుణ్యాలు' గురించి ఆలోచించాలి. ఎందుచేతనంటే పాపం వల్లే దుఃఖం వస్తుంది. దుఃఖం వుంటే ఎంత ధనం వున్నా, ఎన్ని సుఖాలు వున్నా అనుభవించలేడు. జీవితం నరక ప్రాయమవుతుంది.

అందుచేత ఏది పాపమో తెలుసుకోవాలి. ఎందుకు పాపాలు చెయ్య కూడదో తెలుసుకోవాలి. అలాగే పుణ్యం ఎందుకు చెయ్యాలో తెలుసుకోవాలి. అప్పుడే మానవ జీవితం తాను అనుకున్నట్టు వుంటుంది. సంతోషంగా జీవించగలుగుతాడు. అంతే తప్ప ఎన్ని పూజలు చేసినా, ప్రార్థనలు చేసినా, నమాజులు, భజనలు చేసినా ప్రయోజనం ఉండదు. అందుచేత ముఖ్యంగా మానవుడు ఆలోచించ వలసింది 'పాప, పుణ్యాల' గురించే కాని, ధన సంపాదన గురించి కాదు. "ధనం ఎంత సంపాదించినా దుఃఖం పోదు. పుణ్యం రాదు. పైగా అధర్మంగా సంపాదిస్తే పాపం కూడా చుట్టుకుంటుంది. అందుచేత 'ధనమే ప్రధానం కాదని' తెలుసుకోవాలి. ముందుగా పాప పుణ్యాల గురించి తెలుసుకుందాం.

పాప పుణ్యాలన్నవి ఎవరికి వారు వారి జీవితంలో చేసుకొన్న కర్మల్ని బట్టి మాత్రమే వస్తాయి. ఇంకొకరు ఇచ్చేవి కావు... అంటే ఇంకొకరిని అర్థించినా, ప్రార్థించినా, కీర్తించినా పుణ్యం అన్నది రాదు. పాపం అన్నది పోదు. ఎవరికైనా పుణ్యం రావాలంటే మంచి కర్మలు చేయాలి.పాపం రాకూడదంటే చెడుకర్మలు చెయ్యకూడదు. ఇదే సృష్టి యొక్క కర్మ సిద్ధాంతం. అందుచేత ముందు కర్మ సిద్ధాంతం గురించి యోగులు ఏమి చెప్పారో తెలుసుకుందాం.

1. శ్రీకృష్ణ భగవానుడు ఇలా చెప్పారు. "ఎవరు ఏ కర్మ చేసుకుంటే ఆ కర్మ ఫలాన్నే అనుభవిస్తారు"
2. ఏసుక్రీస్తు "నీవు ఏది విత్తుతే అదే పొందుతావు" అన్నారు.
3. మహమ్మద్ ప్రవక్త "రేపటి కోసం (వచ్చే జన్మ) నేడు పంట పండించే పొలమే ఈ లోకం" అన్నారు.
4. బ్రహ్మర్షి సుభాష్‌పత్రి గారు "మంచి చేస్తే మంచి, చెడు చేస్తే చెడు" అన్నారు.
5. గురునానక్ "ఎంత చేశానో అంతే అనుభవించాను. మరొకర్ని ఏమో అనుకుని ప్రయోజనం లేదు" అన్నారు.
6. రాధాస్వామి "ఏ ఏ కర్మలు చేస్తామో ఆయా అనుభవాలు పొందవలసి వుంటుంది" అన్నారు.
7. మహాజ్ఞాని సహజోబాయి "పశు, పక్షి, నర, సురు, అసుర, జలచర, కీటకాదులన్నీ చేసుకున్న కర్మలు అనుభవిస్తున్నవే" అన్నారు.
8. తులసీదాసు "ఈ ప్రపంచంలో కర్మ సిద్ధాంతానికే రాచరికం" అన్నారు.

వీరంతా కర్మ సిద్ధాంతం గురించి స్పష్టంగా తెలియచేశారు. అందుచేత కర్మలు చేసేటపుడు బాగా ఆలోచించాలి.

ఒక చిన్న వస్తువు కొనటానికి ఎంతో ఆలోచిస్తాం. ఎన్నో షాపులు తిరిగి, నాణ్యతను పరిశీలించి మాత్రమే కొంటాం. మరి కర్మలు చేసేటపుడు ఎందుకు ఆలోచించం? అలా ఆలోచించకుండా కర్మలు చేస్తే దుఃఖం పొందమా? అందుచేత కర్మలు గురించి తెలుసుకుందాం. ముఖ్యంగా పుణ్య కర్మలు గురించి తెలుసుకుందాం. అసలు పుణ్యం అంటే ఏమిటో? పుణ్యం చేస్తే వచ్చే ఫలితం ఏమిటి? పుణ్యం ఎలా చెయ్యగలమో తెలుసుకుందాం.

## పుణ్యమంటే?

**ఏ పని చేస్తే జీవితంలో భోగం కలుగుతుందో దానిని "పుణ్యం" అంటారు.**

అంటే ఇతరులకు, ఇతర జీవులకు ఆనందం కలిగించడం. ఆనందం కలిగించే పనులు చెయ్యడమే పుణ్యం. వీటినే మంచి పనులు అంటారు.

అలా సమాజానికి, లోకానికి మంచి చేస్తే వచ్చే పుణ్యం వల్ల మన జీవితంలో మంచి జరుగుతుంది. అంటే భోగవంతంగా జీవిస్తాం. ఆనందాన్ని పొందుతాం. మరి మంచి కర్మలు చెయ్యాలంటే మంచి గుణాలు కావాలి. మంచి మనసు వుండాలి. అపుడే మంచి కర్మలు చెయ్యగలం. పుణ్యం సంపాదించగలం. అందుచేత ముందుగా మంచి గుణాలు సంపాదించటానికి ప్రయత్నించాలి.

ధ్యానం చేస్తే మనలోని గుణాలు మారి మంచి పనులు అంటే మంచి

కర్మలు చేయగలుగుతాం మంచి భవిష్యత్తు సంపాదించుకోగలుగుతాం. అంటే పుణ్యాన్ని సంపాదించుకున్న వారమవుతాం. జీవితంలో భోగం అనుభవిస్తాం.

## పాపమంటే ?

పాపం గురించి సరైనా అవగాహన వుంటే పాపాలు క్షమించమని భగవంతుని ప్రార్థించం, పాపాలు చెయ్యకుండా వుంటాం. అందుచేత పాపం గురించి తెలుసుకుందాం.

**"ఏ పని చేస్తే జీవితంలో దుఃఖం కలుగుతుందో ఆ పనిని పాపం అంటారు".** అంటే 'దుఃఖం కలిగించేదే పాపం.' ఇంకా లోతుగా ఆలోచిస్తే **"మన వల్ల సృష్టిలో ఏ ప్రాణికి గాని, ఏ జీవికి గాని, ఏ మానవునికి గాని వీసమెత్తు కష్టం, నష్టం, బాధ కలిగినా అదే పాపం".** అంటే లోకంలో మన వల్ల ఎవరికి కష్టం కలిగినా అది పాపమవుతుంది. అంటే **"ఇతరులకు ఇతర జీవులకు కష్టం కలిగించేదే పాపం."**

ఇతరులకు కలిగించిన కష్టమే పాపమై తిరిగి దాని ఫలితం మనం కష్టాల రూపంలో అనుభవిస్తున్నాం. ఇది సృష్టి ధర్మం. అందుచేత పాపం చేసిన వారు దుః ఖాల పాలవుతున్నారు. కారణం అంతా భగవత్ స్వరూపులే, సృష్టిలో భగవంతుడు కానిది లేనిది అంటూ ఏదీ లేదు. ముందు ఇది తెలుసుకోవాలి. ఆఖరుకు చీమకు హాని జరిగినా అది భగవంతునికి కష్టం కలిగినట్లేనని తెలుసుకోవాలి. మరి భగవంతునికి కష్టం కలిగించింది పాపం కాక ఏమవుతుంది? అందుచేత దాని ఫలితం తప్పక అనుభవించవలసిందే!

లోకంలో భగవంతుని అనుగ్రహం కోసం, ఆయనను ఆనందింప చెయ్యాలని విగ్రహాలకు షోడశోపచార పూజలు చేస్తున్నారు. పదహారు రకాల ఉపచారాలు చేసి విగ్రహాలను ఆనందింప చేస్తున్నారు. ఫోటోలను ప్రార్థిస్తున్నారు. భజనలు, స్తోత్రాలు చేస్తున్నారు. ఇవన్నీ భగవంతుని ఆనందింప చేయటానికే కదా చేస్తున్నారు? కానీ ఇక్కడ ఆలోచించవలసిందేమిటంటే మానవులు విగ్రహాలను, బొమ్మలను ఆనంద పరుస్తున్నారు కానీ సాక్షాత్తూ అన్ని జీవుల రూపాలలో వున్న ఆ భగవంతునే కష్టపెడుతున్నారు. ఆలోచించండి భగవంతునికి కష్టం కలిగిస్తే ఆయన అనుగ్రహం ఎలా కలుగుతుంది? ఆయనకు కష్టం కలిగించి ఎలా లాభం పొందుతారు? ఎలా ఆనందంగా జీవిస్తారు? అందుచేత **"పాపమంటే భగవంతునికి కలిగించే కష్టమే కానీ ఇతరులకు, ఇతర జీవులకు కాదని అర్థం చేసుకోవాలి".** ఇది ఆలోచించినప్పుడు అసలు పాపాలే చేయరు."

కానీ ఇదంతా ఆలోచించకుండా భగవంతుని గురించి తెలుసుకోకుండా పాపాలు చేస్తూ కష్టాల పాలవుతున్నారు. కష్టాలను భరించలేక, కష్టాలు ఎందుకు

వస్తున్నాయో గ్రహించక, కష్టాల నుంచి బయటపడటానికి రకరకాల మార్గాలు అనుసరిస్తున్నారు, రకరకాల గురువులను ఆశ్రయిస్తున్నారు, రకరకాల స్వామీజీలను, బాబాలను ఆశ్రయిస్తున్నారు. కానీ ఎన్ని చేసినా కష్టాలను అధిగమించలేకపోతున్నారు.

అంతేకాదు అసలు కారణం అర్థం కాక రకరకాల మూఢ నమ్మకాల మీద ఆధారపడు తున్నారు. అలా తాయెత్తులు, రుద్రాక్షలు, ఉంగరాలు, కడియాలు, దండలు, తాళ్ళు, నామాలు, విభూతులు, రక్షా కవచాలు లాంటివి ధరిస్తున్నారు. కానీ ఫలితం కనిపిం చడం లేదు. కారణం వారు చేసిన పాపకర్మలే. అందుచేత ఆలోచించండి. ఇవన్నీ కష్టాలకు, సమస్యలకు పరిష్కార మార్గాలు కావు. కష్టాలు రాకూడదంటే చెడు పనులు చెయ్యకూడదు. అంటే పాప కర్మలు చేయకపోవడమే పరిష్కారమని తెలుసుకోవాలి.

ఇంకా ఆలోచిస్తే కష్టాలు వచ్చిన వారు వాస్తు దోషమనుకుంటారు. వాస్తు సరిచేయిస్తారు. జాతక దోషమనుకుంటారు. జాతకాలు చూసే వారిని సంప్రదిస్తారు. సంఖ్యా దోషమంటారు, నామంలో దోషమంటారు, నెగెటివ్ ఫోర్సు అంటారు. ఇలా రకరకాలుగా ఆలోచిస్తారు కానీ అసలు కారణం ఆలోచించరు. అంతా తాము చేసే పనుల వల్లేనని తెలుసుకోరు. చెడు పనులు చేయకుండా వుండరు. పాపాలు మానరు. అందుచేత అసలు ఈ పాపాలు, ఎందుకు చేస్తున్నారు? దానికి కారణం ఆలోచిద్దాం.

## చెడు చెయ్యటానికి కారణం

ఆలోచిస్తే మానవుడు చెడు చెయ్యటానికి, మంచి చెయ్యకపోవటానికి కారణం, మంచి చెడు తెలియక కాదు... మానవునికి అన్నీ తెలుసు . మంచి తెలుసు, చెడు తెలుసు, తాను చేసింది చెడు అని కూడా తెలుసు. చెడు చెయ్యకూడదని తెలుసు. మరి చెడు ఎందుకు చేస్తున్నాడు? మంచి ఎందుకు చెయ్యడం లేదు?

కారణం **"మంచి చెయ్యడం కష్టం. చెడు చెయ్యడం తేలిక".** అందుచేత మానవుడు **"కష్టమైన మంచిని చెయ్యడం మానేస్తున్నాడు, తేలికైన చెడే చేస్తున్నాడు".** అందుచేత లోకంలో మంచికంటే చెడే ఎక్కువ కనిపిస్తుంది. కాని ఇక్కడ ఆలోచించవలసింది ఏమిటంటే "కష్టమని మంచి చెయ్యడం మానేస్తే జీవితంలో లాభం పొందలేరు సరికదా నష్టపోతారు. అలాగే తేలికని చెడు చేస్తే తాత్కాలిక లాభాలు కలిగినట్టు కనిపించినా చివరకు జీవితంలో కష్టాల పాలవుతారు, దుః ఖాన్ని పొందుతారు".

# జ్ఞానమంటే?

మానవునకు పాప, పుణ్యాల గురించి, మంచి చెడుల గురించి సరైన అవగాహన లేకపోవటానికి ముఖ్యకారణం మానవునకు "జ్ఞానం" లేకపోవడమే. 'జ్ఞానం' యొక్క గొప్పతనం తెలియకపోవడమే. అంతేకాదు ఎంతసేపూ ధనమే గొప్పదని భావించడం వల్ల, జ్ఞానం యొక్క గొప్పతనం తెలుసుకోలేకపోతున్నాడు. జ్ఞానం సంపాదించుకునే ప్రయత్నం చెయ్యడం లేదు, అజ్ఞానంలోనే జీవిస్తున్నాడు, తెలిసి కూడా చేయకూడని పనులు చేస్తున్నాడు, నష్టపోతున్నాడు, కష్టాల పాలవుతున్నాడు.

అందుచేత ముందు జ్ఞానమంటే ఏమిటో తెలుసుకుందాం.

జ్ఞానం రెండు రకాలు (1) సత్యజ్ఞానం, (2) అసత్యజ్ఞానం.

భగవంతునికి సంబంధించిన జ్ఞానాన్ని సత్యజ్ఞానమంటారు. భగవంతుని సృష్టికి సంబంధించిన జ్ఞానాన్ని అసత్య జ్ఞానమంటారు. భగవంతుడ్ని 'పురుషుడు' లేక 'ఆత్మ' అని కూడా అంటారు. సృష్టిని 'ప్రకృతి' లేక 'అనాత్మ' అని కూడా అంటారు. ఒక రకంగా ఈ పురుష, ప్రకృతిల కలయికే వున్నదంతా. అందుచేత భగవంతుని గురించి, భగవంతుని సృష్టి గురించి, సృష్టిలోని జీవుల గురించి, సృష్టి నియమాలు అంటే ధర్మాలు గురించి తెలుసుకోవడమే జ్ఞానం. వీటి గురించి ఎంత ఎక్కువ తెలుసుకుంటే వారిని అంత జ్ఞాని అంటారు. వీటి గురించి తెలుసుకోకపోతే వారిని 'అజ్ఞాని' అంటారు.

ఈ జ్ఞానమున్న వారు సృష్టికి, సృష్టి ధర్మాలకు అనుగుణంగా ప్రవర్తిస్తారు. ఆనందంగా జీవిస్తారు. ఈ జ్ఞానం లేనివారు సృష్టికి, సృష్టి ధర్మాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తారు, కష్టాల పాలవుతారు, దుఃఖాన్ని పొందుతారు. అంటే మానవుని దుఃఖానికి కారణం జ్ఞానం లేకపోవడమే.

'జ్ఞానాన్ని' ఒక రకంగా వెలుగుతో పోలుస్తారు. 'అజ్ఞానాన్ని' చీకటితో పోలుస్తారు. చీకటి ఎవరికైనా ఎంత ఇబ్బందో! అలాగే అజ్ఞానం అంత ఇబ్బంది. అలాగే వెలుగు ఎంత సుఖమో! జ్ఞానం అంత సుఖం. ఒక రకంగా జ్ఞానం లేనివాడిని కళ్ళున్న గుడ్డివాడు అనుకోవచ్చు. ఎందుచేతనంటే చీకటిలో కళ్ళు వున్నా కూడా గుడ్డివాడిలా ప్రవర్తిస్తాడు కాబట్టి.

గుడ్డివాడు ప్రయాణించలేడు అందరి సహాయం అర్థిస్తాడు. అలాగే జ్ఞానం లేనివాడు జీవించలేడు. కష్టాలపాలవుతాడు. వారి సహాయం, వీరి సహాయం అర్థిస్తాడు. దారి చూపించమని, కష్టాల నుంచి బయటపడే మార్గం చూపించమని, గురువులను, పండితులను, దేవుళ్ళను అర్థిస్తాడు. అందుచేత మానవునకు జ్ఞానం చాలా అవసరం. అందుచేత ఎవరైనా ముందు జ్ఞానం గురించి ఆలోచించాలి. అసలు మానవుడు భూమి మీదకు వచ్చిందే జ్ఞానం సంపాదించుకోవడానికి, జ్ఞానాన్ని

పెంచుకోవడానికి.

కానీ ప్రస్తుతం లోకంలో అంతా ధనానికి ప్రాముఖ్యం ఇస్తున్నారు ధనమే గొప్పదనుకుంటున్నారు. కానీ ఎవరూ జ్ఞానం గురించి ఆలోచించడం లేదు. జ్ఞానం యొక్క గొప్పతనం తెలుసుకోవడం లేదు. జ్ఞానాన్ని సంపాదించుకోవటానికి ప్రాముఖ్యం ఇవ్వడం లేదు. అందుచేత ముందు ధనానికి, జ్ఞానానికి వున్న తేడా తెలుసుకుందాం. ధనమున్న వారికి జ్ఞానమున్న వారికి వున్న తేడా ఏమిటో కూడా తెలుసుకుందాం.

- ధనం అశాశ్వతం – జ్ఞానం శాశ్వతం.
- ధనాన్ని దోచుకోగలరు. కానీ జ్ఞానాన్ని ఎవరూ దోచుకోలేరు.
- ధనం పంచితే తరుగుతుంది. జ్ఞానం పంచితే పెరుగుతుంది.
- ధనం కూడా రాదు కానీ జ్ఞానం ఎన్ని జన్మలెత్తినా కూడా వస్తుంది.
- ధనం దుఃఖాన్ని పెంచుతుంది. కానీ జ్ఞానం దుఃఖాన్ని హరిస్తుంది.
- ధనమున్న వారికి ముక్తి రాదు. జ్ఞానమున్న వారికి ముక్తి లభిస్తుంది.

పై విషయాలను బట్టి జ్ఞానమే గొప్పదని తెలుస్తుంది. అందుచేత **"ధనంలో పేదవారైనందుకు బాధపడకండి. జ్ఞానంలో పేదవారైనందుకు బాధపడండి".**

మరి జ్ఞానం పెరగాలన్నా, మనలో జ్ఞానజ్యోతి వెలగాలన్నా ఒక్కటే మార్గం. అదే ధ్యాన మార్గం "ధ్యానం చెయ్యండి – జ్ఞానజ్యోతి వెలిగించుకోండి" అందుకే "తమసోమా జ్యోతిర్గమయ" అన్నారు. అంతేకాదు యోగులంతా జ్ఞానానికి ప్రాముఖ్యం ఇచ్చారు, జ్ఞానవంతులయ్యారు, లోకంలో గొప్పవారిగా గుర్తించబడ్డారు.

## అజ్ఞానమంటే?

ఇప్పటి దాకా జ్ఞానం యొక్క గొప్పతనం తెలుసుకున్నాం. కానీ జ్ఞానం లేకపోతే ఎవరైనా అజ్ఞానంలోనే వుంటారు. నష్టపోతారు. దుఃఖాల పాలవుతారు. అందుచేత అసలు అజ్ఞానం అంటే ఏమిటి? అసలు మనం అజ్ఞానంలో వున్నామా? జ్ఞానవంతులమయ్యామా? అసలు అజ్ఞానంలో వున్నవారి ప్రవర్తన ఎలా వుంటుందో కొద్దిగా తెలుసుకుందాం.

"తెలిసి కూడా తెలియనివారిలా ప్రవర్తించడమే అజ్ఞానం". ప్రస్తుతం మనం అలాగే ప్రవర్తిస్తున్నాం. ఈ అజ్ఞాన కారణంగా అన్నీ తెలిసి కూడా మనం తప్పులు, పాపాలు చేస్తున్నాం. జీవితాన్ని దుఃఖమయం చేసు కుంటున్నాం. అజ్ఞానంతో జీవిస్తే ఎవరూ సుఖశాంతులు పొందలేరు. ఇతరులకు మేలు చేయలేరు. సరికదా కీడు చేస్తారు. అజ్ఞానంలో జీవిస్తున్నంతకాలం జనన మరణ చక్రంలో నలుగుతూనేవుం టాం. బాధలు, దుఃఖం సమస్యలు, రోగాలు, ఇబ్బందులు అనుభవిస్తూనే వుంటాం.

అందుచేత ముందు మనం అజ్ఞానంతో ప్రవర్తిస్తున్న వాటిలో కొన్నిటిని తెలుసుకుందాం.

1. భూమి మీద కంటికి కనిపించేవన్నీ నశించిపోయేవే అని తెలుసు. కానీ వాటినే కోరుకోవడం, వాటి కోసం తాపత్రయపడడం, వాటి కోసమే ప్రయత్నించడం.
2. భౌతిక సంపదలు శాశ్వతం కాదని తెలుసు, కానీ వాటి కోసమే జీవితమంతా వృధాచేయడం.
3. ఏదీ వుండదు. ఏదీ శాశ్వతం కాదని తెలిసి కూడా తనకున్నవన్నీ చూసి పొంగిపోతూ, మురిసిపోతూ వుండడం.
4. ఎంత సంపాదించినా, ఎన్ని సుఖాలు సమకూర్చుకున్నా, జీవితంలో శాంతి, ఆనందం లేవని తెలుసు, కానీ సంపదలు, సుఖాలు కోరుకోవడం, వాటికే ప్రాముఖ్యం ఇవ్వడం, వాటి కోసమే ప్రయత్నించడం.
5. యుగయుగాలుగా ఎంతో మంది మహారాజులు, ఐశ్వర్యవంతులు.. వారి రాజ్యాలు, ఐశ్వర్యాలు కోల్పోయారని తెలుసు, కానీ వాటినే కోరుకుంటూ వాటి కోసం జీవితాన్ని వ్యర్థం చేసుకోవడం.
6. భార్య, పిల్లలు వీరెవరూ శాశ్వతం కాదు, కూడా రారు. ఈ దేహం వున్నంతవరకే అని తెలుసు. కానీ వారు శాశ్వతమన్నట్టుగా ప్రవర్తించడం
7. మరణిస్తామని తెలిసి కూడా మరణం లేనట్లుగా ప్రవర్తించడం.
8. ముందు వారెందరో చనిపోవడం చూస్తున్నాం, ఎవరూ శాశ్వతం కాదని తెలుసు. కానీ శాశ్వతమన్నట్టు శవం దగ్గర కూర్చుని రోదించడం.
9. పేరు ప్రఖ్యాతులు, కీర్తి ప్రతిష్ఠలు పదవులు లాంటివి ఏవీ తన ముందు వారికి ఎవరికీ శాశ్వతంగా లేవని తెలుసు. కానీ వాటి కోసమే ఆలోచించడం, ప్రయత్నించడం.
10. ఏదీ శాశ్వతం కాదంటూ, అన్నిటి మీద మమకారం పెంచుకోవడం.
11. కోరికలే దుఃఖానికి మూలం అంటూ, మరల అన్నీ కోరుతూ వుండటం, అన్నీ ఆశిస్తూ వుండటం.
12. కనపడని జీవితం ఉందని తద్దినాలు, శ్రాద్ధాలు పెడుతూ, కనపడే జీవితం గురించే ఆలోచించడం. దానికే ప్రాముఖ్యం ఇవ్వడం, కనబడని జీవితం గురించి ఆలోచించకపోవడం.
13. కష్టాలకు కారణం పాప కర్మలే అంటూ మరల పాపాలు చేయడం.
14. మానవులంతా పుట్టినపుడు ఒకే రకంగా పుట్టడం, చనిపోయేటపుడు ఒకే రకంగా చనిపోవడం చూస్తూ, వేరే వేరే కులాలు, మతాలు అన్నట్టుగా జీవించడం, ప్రవర్తించడం.
15. భయపడకూడదని తెలిసి, అన్నిటికి భయపడడం.
16. ఏదో ఒకరోజు మరణించ వలసిందేనని తెలుసు, కానీ చేయవలసిన పనులు, ధ్యానసాధన వాయిదా వేస్తూ వుండటం.
17. అసత్యాలు పలుకకూడదు, ఇతరులను మోసగించకూడదు. అవమానించ కూడదు, బాధించకూడదు, హింసించకూడదు, చులకనగా చూడకూడదని

తెలిసి కూడా అవే చేయడం.

18. లోకానికి మేలు చెయ్యాలని తెలుసు కాని ఏమీ చెయ్యకపోవడం.
19. ఏదీ వుండదు, చివరికి తానే వుండనని తెలుసు, కానీ గర్వంతో, అహంకారం తో విర్రవీగుతూండటం.
20. గుణం ముఖ్యం అంటూ రూపానికి, డబ్బుకు ప్రాధాన్యం ఇవ్వడం.
22. ఏదీ వృధా చేయకూడదంటూ అన్నిట్లో పొదుపు పాటిస్తూ విలువైన సమయాన్ని, వాక్కును, జీవితాన్ని వృధా చేయడం.
23. 'సర్వేజనా సుఖినో భవంతు అని ప్రార్థిస్తూ' తన సుఖం, తన బాగు మాత్రమే చూసుకోవడం, ఇతరుల సుఖం గురించి చూడకపోవడం పైగా కీడు చెయ్యడం.
24. అందరికీ నీతులు చెబుతూ, తాను ఆచరించకపోవడం.
25. ఇతరులు మారాలంటూ, తాను మారడానికి ప్రయత్నించక పోవడం.

అజ్ఞానంతో ప్రవర్తించే వాటిలో ఇవి కొన్ని. ఇలా ప్రవర్తిస్తే ఎవరైనా దుఃఖానికి లోనుకావలసిందే. అందుచేత ఎవరైనా ముందు అజ్ఞానాన్ని తొలగించుకోవాలి.

## జ్ఞానవంతులవ్వాలంటే!

మరి అజ్ఞానం తొలగాలన్నా, జ్ఞానవంతులు కావాలన్నా మనస్సనే మాయ నుండి బయటపడాలి. మనస్సును జయించాలి. మనస్సు యొక్క ప్రాముఖ్యం తగ్గించాలి, మనస్సును శుద్ధి చెయ్యాలి. మనస్సును నిర్మలం చెయ్యాలి ఆ మార్గమే 'ఆనాపానసతి ధ్యానం'.

ధ్యానం చెయ్యడం ద్వారా మనస్సు శుద్ధమవ్వడం వల్ల మనసు యొక్క ప్రాముఖ్యం తగ్గుతుంది. 'ఆత్మ' ప్రాముఖ్యం పెరుగుతుంది. అపుడు 'ఆత్మ' అంటే భగవంతుడు చెప్పే ధర్మాల్ని ఆచరించగలుగుతాం. తెలిసి కూడా తెలియనివాడిలా ప్రవర్తించం. "అజ్ఞానాన్ని తొలగించుకుంటాం. జ్ఞానవంతులౌతాం."

భవిష్యత్తులో జ్ఞానమున్న వారికే ఎక్కువ విలువ, గౌరవం వుంటుంది. జ్ఞానాన్ని పెంచుకునే మార్గాలలో పుస్తకపఠనం కూడా ముఖ్యమైనదే. యోగుల, జ్ఞానుల పుస్తకాలు చదవడం ద్వారా మన జ్ఞానాన్ని ఎంతో పెంచుకోవచ్చు. అందుచేత పుస్తకాలు బాగా చదవండి. పుస్తకాలు చదవటానికి ప్రాముఖ్యం ఇవ్వండి. జ్ఞానవంతమైన పుస్తకాలు సేకరించుకోండి.

మీ సమయాన్ని పుస్తకాలు అధ్యయనం చెయ్యడానికి, అలాగే మీ ధనాన్ని పుస్తకాలు సేకరించుకోవడానికి వినియోగించండి. ధనాన్ని వ్యర్థం చెయ్యకండి, వ్యర్థంగా కర్చు పెట్టకండి. విందులకు, వినోదాలకు, సరదాలకు కర్చు పెట్టకండి. జ్ఞానవంతమైన పుస్తకాలకు వినియోగించండి.

పుస్తకాలతో పాటు జ్ఞానవంతుల, జ్ఞానం చెప్పగలిగిన వారితో సాంగత్యం చెయ్యాలి. అందుచేత ధ్యానం, స్వాధ్యాయం, సజ్జన సాంగత్యం ద్వారా జ్ఞానధనులు అవ్వండి. "లోకధనం కంటే జ్ఞాన ధనం చాలా చాలా గొప్పదని తెలుసుకోండి".

# భుక్తి విద్య - ముక్తి విద్య

ఆలోచిస్తే మనమంతా వచ్చింది ముక్తి కోసం కానీ చేసే ప్రయత్నం మాత్రం భుక్తి కోసం. కారణం ముక్తి యొక్క గొప్పతనం తెలియక పోవడమే. అది తెలియాలంటే దానికి సంబంధించిన విద్య అభ్యసించాలి. దాని గురించి తెలుసుకుందాం.

ఈ విద్య రెండు రకాలు (1) భుక్తి కోసం విద్య (2) ముక్తి కోసం విద్య. అంతా భుక్తిని సంపాదించి పెట్టే విద్యలనే అభ్యసిస్తున్నారు. కానీ ముక్తిని సంపాదించి పెట్టే విద్యను అభ్యసించడం లేదు. భుక్తిని సంపాదించి పెట్టే విద్యలను ప్రాపంచిక విద్యలంటారు. కానీ ముక్తిని సంపాదించి పెట్టే విద్యను ఆధ్యాత్మిక విద్య అంటారు. భుక్తికి సంబంధించిన విద్యను 'క్షర' విద్య అంటారు. ముక్తికి సంబంధించిన విద్యను 'అక్షర' విద్య అంటారు. 'క్షర' విద్య అంటే నశించిపోయే సృష్టికి సంబంధించినది. 'అక్షర విద్య' అంటే నశింపు లేని భగవంతునికి సంబంధించినది. భుక్తిని ఇచ్చే ప్రాపంచిక విద్యలను అభ్యసిస్తే భుక్తి, భోగము వస్తాయి కానీ ముక్తినిచ్చే ఆధ్యాత్మిక విద్యను అంటే ఆత్మ విద్యను అభ్యసిస్తే ముక్తి, శాశ్వత ఆనందం వస్తాయి.

మానవునకు "భుక్తి – ముక్తి" రెండూ అవసరమే. మానవుడు రెండిటి కోసం ప్రయత్నం చెయ్యాలి. భుక్తి చూసుకుంటూ... ముక్తి కోసం కూడా ప్రయత్నించాలి.

చాలా మంది తమ జీవితాన్నంతా దుఃఖం నుండి తాత్కాలికంగా బయట పడటానికి వెచ్చిస్తారు. కానీ అలా వెచ్చించే బదులు అందులో నాలుగోవంతు సమయం వెచ్చిస్తే ఈ జన్మలోనే దుఃఖం నుండి శాశ్వతంగా బయటపడవచ్చు. ముక్తిని పొందవచ్చు.

అందుచేత భుక్తి కోసం కావలసిన విద్యను అభ్యసిస్తూ, దానితో పాటు ముక్తినిచ్చే విద్యను కూడా అంటే ఆత్మ విద్యను అభ్యసించాలి, ప్రాముఖ్యం ఇవ్వాలి.

## దేహం గురించి కాదు – ఆత్మ గురించి ఆలోచించాలి

లోకంలో అందరూ ఎక్కువగా దేహానికి ప్రాముఖ్యం ఇస్తారు. కారణం దేహం తామనే భావన. అలా దేహ అందానికి, దేహ ఆరోగ్యానికి, దేహ సుఖానికి ప్రాముఖ్యం ఇస్తూ దానికోసం పాటు పడుతూ వుంటారు. అలా దేహాన్ని అలంకరించడానికి, దేహాన్ని సౌష్టవంగాను, బలంగాను, ఆకర్షణీయంగా వుంచుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తూ వుంటారు.

కానీ మానవులు ఆలోచించవలసింది దేహం గురించి మాత్రమే కాదు. ఆత్మ గురించి కూడా ఆలోచించాలి. కారణం “దేహం తాను కాదు ఆత్మే తాను”.

ఇంకా ఆలోచిస్తే దేహం తాత్కాలికం. ఆత్మ శాశ్వతం. దేహానికి ప్రాముఖ్యం ఇచ్చే వారు రోగాలను, దుఃఖాన్ని నివారించుకోలేరు. కానీ ఆత్మకు ప్రాముఖ్యం ఇచ్చే వారు అన్నిటిని అధిగమించి ఆనందంగా వుంటారు. దేహానికి ప్రాముఖ్యం ఇచ్చేవారికి చెడు గుణాలు, అలవాట్లు మారవు. కానీ ఆత్మకు ప్రాముఖ్యం ఇచ్చే వారికి చెడు గుణాలు, చెడు అలవాట్లు మారిపోతాయి.

దేహానికి ప్రాముఖ్యం ఇచ్చేవారు సత్యాన్ని గుర్తించలేరు. ధర్మాన్ని ఆచరించలేరు. కానీ ఆత్మకు ప్రాముఖ్యం ఇచ్చే వారు ధర్మయుక్తంగా జీవిస్తారు. సత్యాన్ని అనుసరిస్తారు. అందుచేత ఆత్మ గొప్పదని ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలి.

## మానవ జీవిత లక్ష్యం!

అందుచేత ఆత్మ గురించి, ఆత్మ ప్రాముఖ్యం గురించి ఇంకా తెలుసుకుందాం.

వేదాలలో ‘అథాతో బ్రహ్మ జిజ్ఞాస’ అని వుంది అంటే “బ్రహ్మ విచారణ చేయటానికే మానవ జీవితం” అని అర్థం. బ్రహ్మం అంటే అన్నిటికంటే గొప్పది. అదే ఆత్మ అంటే ఆత్మ గురించి విచారణ చేయడానికే మానవ జన్మ అని అర్థం. మరి అంతటి గొప్పదైన ఆత్మను వదిలి మనం అనిత్యమైన అత్యల్ప విషయ జిజ్ఞాసలో నిమగ్నులమై ఉన్నాం. వేదాలలో ఇంకా “అహం బ్రహ్మోస్మి” అంటే “అంతటి సర్వాధిక్యమైన బ్రహ్మాన్ని నేనే” అని చెప్పబడింది.

కాని మనం అంతటి సర్వాధిక్యమైన మన గురించి ఆలోచించ డానికి బదులు ఆహారం, నిద్ర, భయం, మైథునం, అనే విషయాల మీదే ఆసక్తి చూపిస్తున్నాం. ఈ ఆహారం, నిద్ర, భయం, మైధునాలు మానవులే కాకుండా పశువులు కూడా అనుభవిస్తున్నాయి. ఏ ప్రాణి రూపంలోనైనా వాటిని అనుభవించవచ్చు. వాటి కోసం ప్రత్యేకించి మానవజన్మే తీసుకోనవసరం లేదని వేదాంత సూత్రాలు బోధిస్తున్నాయి. నీచాతి నీచమైన జంతువుగా ఎంచబడే పందికి కూడా తినడానికి, పిల్లలను కనడానికి, నిద్రించడానికి, ఆత్మరక్షణ చేసుకోవడానికి ప్రకృతిలో సౌకర్యాలు కల్పించబడ్డాయి. వాటి గురించి ప్రయత్నించకపోయినా ఎవరికైనా అవి లభిస్తాయి.

మరి మొత్తం ప్రాణి కోటిలోనే ఉత్తమమైన మానవ జన్మ పొంది భూలోకంలో ఉన్న 84,00,000 జీవ రాసులలో విశిష్టమైన జన్మగా భావిస్తున్న మానవుడు మిగిలిన జీవుల వలే ప్రవర్తించడం, అంతకన్నా ఎక్కువగా ఆలోచించకపోవడం

అన్నది ఇచ్చిన అవకాశాన్ని పూర్తిగా వ్యర్థం చేసుకోవడమే. మరి దుర్లభమైన మానవ జన్మ పొంది జీవితంలో మనం ఏం సాధించామని ఆలోచిస్తే చివరకు ఏమీ కనిపించదు. మన వల్ల లోకానికి ఏమైనా ఉపకారం జరిగిందా ? అని ఆలోచిస్తే అంతా అపకారమే కాని ఉపకారం ఏమీ లేదని తెలుస్తుంది. మరి మానవ జన్మ యొక్క విశిష్టత ఏమిటి? గొప్పతనం ఏమిటి? లక్ష్యం ఏమిటి?

శాశ్వతమైన ఆనందాన్ని పొందటానికి భౌతిక ప్రకృతిని ఆశ్రయిం చడం మార్గం కాదు. మనకు నిజంగా ఆనందం కావాలంటే ముందర మనమెవరో తెలుసుకోవాలి. ఈ దేహం నేను కాదని గ్రహించాలి. ఆత్మే నేను అని తెలుసుకోవాలి. ఈ జ్ఞానం కలగాలంటే ధ్యాన సాధన చెయ్యాలి. ఇన్నాళ్ళు ఇంద్రియాలను సేవించాం. ఇప్పుడు ఆత్మను సేవించడానికి పూనుకోవాలి అంటే ధ్యానం చెయ్యాలి.

మన మనస్సుకు మనం బద్ధులమై ఉన్నంత కాలం పొరపాట్లు చెయ్యడం, భ్రాంతిలో పడటం, మోసగించడం ధర్మాన్ని అతిక్రమించడం లాంటి వాటికి గురి కావలసి వస్తుంది. కానీ ధ్యానం చేస్తే మనం మనస్సు ప్రాముఖ్యం తగ్గించుకుంటూ ఆత్మ ప్రాముఖ్యత పెంచుకుని చివరకు ఆత్మను తెలుసుకోగలగుతాం. ఆత్మ సాక్షాత్కారం పొందుతాం. అదే మోక్షం. అదే "మానవ జీవిత లక్ష్యం". ఆ లక్ష్యం సాధిస్తే తిరిగి మానవ జన్మ పొందవలసిన పనిలేదు.

## నిత్యం - అనిత్యం

నిత్యం అంటే శాశ్వతమైనది. అనిత్యం అంటే అశాశ్వతమైనది. ఈ సృష్టిలో నిత్యమైనది వుంది, అనిత్యమైనవి వున్నాయి. మానవులకు ఈ తేడా తెలియక ఎంతసేపూ అనిత్యమైనవే గొప్పవనుకుంటున్నారు, వాటికే ప్రాముఖ్యం ఇస్తున్నారు. కానీ నిత్యమైన దాని గురించి ఆలోచించడం లేదు. అసలు మానవులకు ఈ నిత్య-అనిత్య వివేకమే లేదు. అంటే ఆలోచనే లేదు. దీనికి ముఖ్య కారణం పెద్దలు పిల్లలకు ఈ తేడాను వివరించకపోవడమే. పెద్దలు ఎంతసేపూ పిల్లల్ని బాగా చదవ మని, బాగా సంపాదించమని ప్రోత్సహిస్తున్నారు. అలా చేస్తే బాగా సుఖపడవచ్చని, అనుభవించవచ్చని చెపుతున్నారు. అందుచేత పిల్లలు కూడా పెద్దలు చెప్పిన దానికే ప్రాముఖ్యం ఇస్తున్నారు, అలాగే జీవిస్తున్నారు. అంతకన్నా ఆలోచించడం లేదు.

కానీ మానవునకు దుఃఖం కలగడానికి మరొక కారణం ఈ నిత్య - అనిత్య వివేకం లేకపోవడమే. అంటే ఏది శాశ్వతం? ఏది అశాశ్వతమో? తెలుసుకోకపోవడమే! వాటి గురించి ఆలోచించకపోవడమే! కానీ ఆలోచించాలి.

మానవులు ఎంతసేపూ అశాశ్వతమైనవే శాశ్వతం అనుకుంటున్నారు. వాటిలోనే ఆనందం వుందనుకుంటున్నారు. వాటికే ప్రాముఖ్యం ఇస్తున్నారు. వాటినే సంపాదించుకుంటున్నారు. వాటి కోసమే జీవితమంతా వెచ్చిస్తున్నారు. తమ శక్తి యుక్తులు వినియోగిస్తున్నారు. ఆలోచించండి అశాశ్వతమైనవి అంటే వుండనివేగా? ఉండనివి ఎప్పుడూ వుంటాయా? ఎప్పుడో ఒకప్పుడు దూరమవుతాయి, అదృశ్య మవుతాయి, అపుడు మానవుడు అంతులేని దుఃఖానికి లోనవుతాడు. దీనిని బట్టి మానవుని దుఃఖానికి ఇదొక కారణం అని తెలుస్తుంది.

మరి ఈ సృష్టిలో నిత్యమైనది ఏది? అంటే ఎప్పుడూ వుండేది ఏది? ఆలోచిస్తే ఈ భూమి, సూర్యుడు, చంద్రుడు లాంటి గ్రహాలు, సమస్త లోకాలు ఎప్పుడో ఒకప్పుడు అదృశ్యమవ్వవచ్చు. కానీ శాశ్వతంగా వుండేది ఒక్కటే ఒక్కటి. అదే 'భగవంతుడు'. అదే 'ఆత్మ'. అంటే 'ఆత్మే' నిత్యమైనది, శాశ్వతమైనది. 'ఆత్మ'ను పొందితేనే అంటే భగవంతుని పొందితేనే మానవుడు శాశ్వతమైన ఆనందాన్ని పొందగలడు. మరి భగవంతుని పొందాలంటే ఏకైక మార్గం ధ్యానం ఒక్కటే. ధ్యానం ద్వారానే ఎవరైనా భగవంతుని పొందగలరు.

అలాగే ఆలోచిస్తే నిత్యమైనది ఎప్పుడూ వుంటుంది. అనిత్యమైనవి వున్నట్టుగా కనిపిస్తాయి కానీ అవి లేనివే. అందుచేత ఈ ఉండే దాని గురించి. లేని వాటి గురించి కొంచెం ఆలోచిద్దాం.

## ఉండేవి – లేనివి!

పై విషయాలను బట్టి సృష్టిలో రెండు రకాలు వున్నాయని తెలుస్తుంది. అవి ఉండేవి – లేనివి. అంటే సృష్టిలో ఉండేవీ వున్నాయి. లేనివీ వున్నాయి. ఇదే సృష్టి యొక్క గొప్పతనం. ఉండే వాటిని శాశ్వతమైనవి అంటారు. లేని వాటిని తాత్కాలికమైనవి అంటారు.

ఈ సృష్టిలోని విచిత్రమేమిటంటే ఉండేది లేనట్లుగా కనిపిస్తుంది, లేనివే ఉన్నట్టుగా కనిపిస్తాయి. అందుచేత మానవులు ఉన్నట్టుగా కనిపించే లేని వాటికోసం ప్రయత్నిస్తారు, తాపత్రయ పడతారు, సంపాదించుకుంటారు, దోచుకుంటారు, కాపాడుకుంటారు, చూస్తే చివరకు ఏదీ వుండదు, చివరకు భంగపడతారు.

ఆశ్చర్యమేమిటంటే వున్నాననుకున్న వాడే వుండడు. తానే లేనపుడు తనవేవి వుంటాయి? ఎంత విచిత్రమో చూడండి. లేని తాను వున్నాననుకుంటాడు. ఉండని వాటిని సంపాదిస్తాడు, వాటిని చూసి గొప్పవాడై పోయాననుకుంటాడు, పైగా గర్విస్తాడు, అహంకరిస్తాడు, జీవితమంతా పరుగులు పెడతాడు, ఏదో

చేసేస్తున్నానను కుంటాడు, చివరకు అదృశ్యమైపోతాడు. అంటే కొన్నాళ్ళకు భూమి మీదే కనిపించడు.

బాగా ఆలోచిస్తే సృష్టిలో ఏవయితే కనబడుతున్నాయో అవన్నీ లేనివే! అలాగే ఏదయితే కనబడదో అదే వుండేది. ఎంత విచిత్రమో చూడండి. "ఉన్నది లేనట్టుగా కనబడుతుంది, లేనివి వున్నట్టుగా కనబడుతున్నాయి". కాని ఇన్ని తెలివితేటలున్నాయనుకునే మానవుడు లేనివాటినే వున్నాయనుకుంటాడు, ఉన్నదానిని లేదనుకుంటాడు.

కాని "లేనిది లేనట్టుగా, ఉన్నది ఉన్నట్టుగా తెలుసుకోగలిగినవాడే తెలివైనవాడు". అలా తెలుసుకున్నవారే "యోగులు". భోగులకు ఇవేమీ బోధపడదు, అర్థం కాదు. కాని అన్నీ తెలుసుననుకుంటారు, ఏవేవో చేస్తుంటారు, చివరకు దుఃఖంలో మునిగిపోతారు. అందులోంచి బయట పడలేక ఈ సత్యాన్ని తెలుసుకున్న యోగుల కాళ్ళ మీద పడతారు. రక్షించమని, దిక్కులేనివాడిలా రోదిస్తుంటారు. అందుచేత ఉండేది ఏదో? లేనిది ఏదో? తెలుసుకోవాలి, ఆలోచించాలి.

గమనిస్తే లేనివన్నీ దుఃఖాన్ని కలిగిస్తాయి. ఉండేదే ఆనందాన్నిస్తుంది. గమనిస్తే ఉండేదాని తెలుసుకున్నవారు గొప్పవారయ్యారు. లేనిది వున్నట్టుగా భావించేవారంతా పాపాల్లో, కష్టాల్లోకూరుకుపోయారు. మరి ఉండేది ఏమిటి? ఎలా తెలుసుకుంటాం?

ఉండేది 'భగవంతుడు' ఒక్కడే. అంటే 'ఆత్మ' ఒక్కటే. మరి ఉండే భగవంతుని తెలుసుకోవాలంటే ధ్యానం ఒక్కటే మార్గం. అంతకు తప్పించి వేరే మార్గం లేదు. ధ్యానం చెయ్యని వారంతా లేనివే వుండేవి అనుకుంటారు. ఉన్న భగవంతుని గురించి అంటే ఆత్మ గురించి అసలు తెలియనే తెలియదు.

**"ఉన్నది ఉన్నట్టుగా, లేనిది లేనట్టుగా తెలుసుకున్నవాడు, చావు పుట్టుకలు లేని జీవితం పొందుతాడు". లేకపోతే వాడికి "చచ్చి పుట్టే జీవితమే గతి".** చచ్చి పుట్టే జీవితమంతా దుఃఖమే, కష్టాలే, బాధలే.

## నాటకం !

నాటకంలో అన్నీ వున్నట్టుగా కనిపిస్తాయి. చివరకు ఏదీ వుండదు. అలాగే అందులోనివన్నీ నాటకంలోని పాత్రలు లాంటివే.

అలాగే ఈ భూమే ఒక పెద్ద నాటకరంగం లాంటిది. అందులో మనమంతా పాత్రధారులం మాత్రమే, ఎవరి పాత్రలు వారు పోషించి చివరకు అంతా నిష్క్రమించవలసిన వారమేనని ఆలోచిస్తే తెలుస్తుంది.

కానీ భూమి మీద ఎవ్వరూ కూడా తమది ఒక పాత్ర అని భావించడం లేదు. అంతా నిజమనుకుంటున్నారు. తాను ఈ కులస్తుడనని, మతస్తుడనని, ప్రాంతస్తుడనని, దేశస్తుడనని, జమీందారునని, నాయకుడునని, అందగాడినని, ఆటగాడినని, స్త్రీనని, పురుషుడనని, పేదవాడినని, కురూపినని, భార్య అని, భర్త అని, తల్లి అని, తండ్రి అని భావిస్తున్నారు. దానికి తగ్గట్టు గానే ప్రవర్తిస్తున్నారు. కానీ ఎవ్వరూ కూడా తాము ఈ నాటకంలో అలాంటి పాత్ర పోషిస్తున్నాను అని భావించడం లేదు.

అలాగే నేను తల్లిని అనుకుంటూ, తండ్రిని అనుకుంటూ భార్య అనుకుంటూ, భర్త అనుకుంటూ వారు నావారు అనుకుంటూ వారి కోసం రాగద్వేషాలు ప్రదర్శిస్తూ, వారి కోసం చేయకూడని పనులు చేస్తూ, ఇతరులను ద్వేషిస్తూ, ఇవన్నీ శాశ్వతం అనుకుంటూ, అన్నిటిని కూడబెడుతూ, అధర్మంగా ప్రవర్తిస్తూ, పాపాలు చేస్తూ కష్టాల పాలవుతున్నారు. అందుచేత దీని గురించి కూడా ఆలోచించాలి.

నాటకంలో రాజు, నేను రాజును అని భావిస్తే ఎలా వుంటుందో! నాటకంలో జమీందారు నేను జమీందారునని, కలెక్టరు నేను కలెక్టరునని, మినిస్టర్ నేను మినిస్టర్‌నని భావిస్తే ఎలా వుంటుందో! భూలోక నాటక రంగంలో మానవులు ఉన్నదంతా నిజమనుకుంటే అలాగే వుంటుంది. కారణం నాటకంలో రాజు నాటకం వున్నంత వరకే రాజు. నాటకం పూర్తవగానే రాజు కాదు కదా! అలాగే జమీందారు, కలెక్టరు, మినిష్టరు కూడా. అలాగే భార్య, భర్త, తల్లి, తండ్రి కూడా.

గమనిస్తే ఒక నాటకంలో వున్న పాత్ర మరో నాటకంలో వుండదు. ఎందుచేతనంటే ఒక నాటకంలో రాజుగా పాత్ర పోషించిన వాడు ఇంకొక నాటకంలో సేవకుడిగా పాత్ర పోషించవలసివస్తుంది. అలాగే ధనవంతుడిగా ఒక నాటకంలో పోషించినవాడు ఇంకొక నాటకంలో అడుక్కునేవాడిగా పాత్ర పోషించవలసి వస్తుంది. అలాగే ఈ నాటకంలో భార్యగా పోషించిన ఆవిడ ఇంకొక నాటకంలో తల్లిగా నటించవలసి రావచ్చు. అలాగే ఈ నాటకంలో భర్తగా నటించినవాడు, ఇంకొక నాటకంలో కొడుకుగా పోషించవలసిరావచ్చు. అంటే నాటకాలు మారినపుడు పాత్రలు మారుతూ వుంటాయి. ఏ పాత్ర శాశ్వతం కాదు. అదే పాత్ర ప్రతీ నాటకంలో వుండదు. అన్నీ మారేవే, మార్పు చెందేవే. అలాగే భూమి మీద ప్రస్తుతం ప్రతీ ఒక్కరి పాత్ర కూడాను. ఎవరు ఎలా వున్నారో శాశ్వతంగా అలాగే వుండరు. ఎవరికి ఏమి వున్నాయో అవి శాశ్వతంగా వుండవు. అన్నీ ఆ పాత్ర వున్నంత వరకే. మరల పాత్ర మారితే అంటే జన్మ మారితే అన్ని

మారిపోతాయి.

అందుకే పత్రీజీ "పాత్రలో జీవించు, కానీ అది పాత్ర అని మాత్రం మరచిపోకు" అని అంటారు. అంటే పాత్రలో లీనమయినట్టుగా చూసేవాడికి కనిపించాలి కానీ, తాను మాత్రం పాత్రలో లీనం కాకూడదు. ఎందుకంటే ఆ నాటకంలో పోషిస్తున్నది పాత్రే కానీ తాను కాదు కాబట్టి. అంటే భర్తగా, భార్యగా నీ పాత్ర పోషించు, జీవించు, కానీ నేను భర్త పాత్రను పోషిస్తున్నాను, భార్య పాత్రను పోషిస్తున్నాను అని మరచిపోకు.

పాత్ర పోషిస్తున్నాను అని భావించేవాడు దుఃఖపడడు, దుఃఖపడుతున్న ట్టుగా కనబడుతాడు. అలాగే జీవితంలో భర్త దూరమైనా, భార్య దూరమైనా, కొడుకు దూరమైనా అందులో లీనమవ్వడు. కారణం అందరివీ పాత్రలే అన్న సత్యం తెలుసు కనుక. కానీ నిజమనుకున్నవాడు అంతులేని దుఃఖానికి లోనవుతాడు. నా జీవితం వ్యర్థం అనుకుంటాడు. ఇక జీవించలేను అనుకుంటాడు. ఒక్కొక్కసారి ఆత్మహత్య కూడా చేసుకోవాలనుకుంటారు. అందుచేత ఈ విషయం ఆలోచించాలి. గుర్తుంచుకోండి "నాటకంలో తండ్రి పోతున్నాడు కానీ, తన తండ్రిపోవట్లేదు". అలాగే "నాటకంలో చనిపోతున్నాడు కానీ తాను చావట్లేదు". ఇది సత్యం.

## మరణానంతర జీవితం వుందా?

ముందుగా మనం ఈ విషయం ఆలోచించాలి. మనం జీవిస్తున్న విధానం సరైనదా? కాదా? ఇది తెలియాలంటే ఈ విషయం నిర్ధారించుకోవాలి. అసలు మనకు మరణించిన తరువాత జీవితం వుందా? లేదా?

ఎందుచేతనంటే మనకు మరణానంతర జీవితమే కనుక లేకపోతే ప్రస్తుతం మనం జీవిస్తున్న విధానం అంటే మన నడవడిక, పనులు, ప్రవర్తన, ఆలోచించే విధానం అన్నీ ఒక విధంగా సరైనవనే అనుకోవచ్చు. కాని ఒకవేళ మరణానంతర జీవితమే కనక మనకు వుంటే! ప్రస్తుతం మనం జీవించే విధానం సరియైనది కాదని ఖచ్చితంగా చెప్పవచ్చు.

ఎందుచేతనంటే ప్రతి ఒక్కరూ ఎంతసేపు మరణించేవరకే ఆలోచిస్తున్నారు. అంటే మరణించే వరకు సుఖంగా వుండాలని! సంతోషంగా వుండాలని! ఏ లోటు లేకుండా జీవించాలని! తిండికి, బట్టకు, వుండటానికి ఏ లోటు రాకూడదని! వున్నంతకాలం హాయిగా జీవించాలని! కోరుకుంటారు, ప్రయత్నిస్తారు. అలా తమ సమయాన్ని, శక్తిని, తెలివినీ అంతవరకే ఉపయోగిస్తున్నారు. అంతకన్నా ఆలోచించడం లేదు. అంటే చనిపోయే వరకు

బాగుంటే చాలు అనుకుంటారు. అంటే ఏ బాధలు, కష్టాలు లేకుండా వెళ్ళిపోతే చాలు అనుకుంటారు. ఎవరిమీద ఆధారపడకుండా, ఎవరితో చేయించుకోకుండా ఉండాలని కోరుకుంటారు. అంటే ప్రస్తుత జీవితం, ప్రస్తుత సంసారం ఆనందంగా వుంటే చాలు అని భావిస్తారు.

కొంచెం ఆలోచిస్తే ఈ జీవితం కాకుండా మరణానంతరం జీవితం కూడా వుంటే; మరి ఆ జీవితం కూడా బాగుండాలి కదా? ఆ జీవితం కూడా ఆనందంగా వుండాలి కదా? మరి అటువంటప్పుడు ఆ జీవితం గురించి ఆలోచించకపోవడం పొరపాటే కదా? అలా ఆలోచించకుండా జీవించడం సరైన విధంగా జీవించక పోవడమే కదా? ప్రస్తుతం వున్న జీవితం గురించి ఎలా తపన పడుతున్నామో! తరువాత వుండేది కూడా మన జీవితమే కదా? మరి దాని గురించి ఎందుకు ఆలోచించడం లేదు? ఆ జీవితం కూడా బాగుండాలని ఎందుకు ప్రయత్నించడం లేదు? అలా ప్రయత్నించక పోతే తరువాత దుర్భరమైన జీవితం గడపవలసి వస్తుంది కదా? అందుచేత ఎవరైనా ముందు ఈ విషయం నిర్ధారణ చేసుకోవాలి.

అసలు మరణానంతర జీవితం వుందా? లేదా? ఇది మనకు తెలియాలంటే మనకంటే గొప్పవారైన జ్ఞానులను ఆశ్రయించాలి. వారినుండి ఈ సందేహాన్ని నివృత్తి చేసుకోవాలి. ముఖ్యంగా మనమంతా శ్రీకృష్ణుని పూజిస్తున్నాం. భగవంతుడని ఆరాధిస్తున్నాం. మరి భగవంతునికి తెలియనిదంటూ ఏమీ ఉండదు కదా? ఆయన చెప్పేవన్నీ సత్యాలే కదా? ఆయన భగవద్గీతలో ఎన్నో సందర్భాలలో స్పష్టంగా మరణానంతర జీవితం ఉందని తెలియచేసారు.

1. పుట్టినవాడు గిట్టక మానడు. గిట్టినవాడు పుట్టక మానడు. (భ.గీ. 2-27)
2. మానవుడు చినిగిపోయిన వస్త్రాలు వదలి కొత్త వస్త్రాలు ఎలా ధరిస్తాడో అలాగే జీర్ణమైన దేహాన్ని వదలి కొత్త దేహాన్ని ధరిస్తాడు. (భ.గీ. 2-22)
3. అర్జునా నాకూ; నీకు ఎన్నో జన్మలు గడిచాయి. అవన్నీ నీకు తెలియవు. కాని నాకు తెలుసు. (భ.గీ. 4-5)

శ్రీకృష్ణ భగవానుడు చెప్పిన దానిని బట్టి మనకు మరణానంతర జీవితం వుందని ఖచ్చితంగా తెలుస్తుంది. అందుచేత మరణానంతరం జీవితం గురించి కూడా మనం ఆలోచించాలి.

అసలు మరణం తరువాత ఏమవుతుంది? ఎక్కడికి వెళతాం? ఏ లోకాలకు వెళతాం? ఎన్నాళ్ళు వుంటాం? అక్కడ ఏమి చేస్తాం? మళ్ళీ ఎందుకు


వస్తాం? ఎప్పుడు వస్తాం? ఎక్కడికి వస్తాం? ఏ ప్రాంతంలో పుడతాం? ఏ కులంలో, ఏ మతంలో పుడతాం? భగవంతుడిగానా? పేదవాడిగానా? అందగాడిగానా? అంగ వైకల్యంతోనా? ఇవన్నీ ఎలా తెలుస్తుంది? ఇలాంటి వాటి గురించి ఆలోచించాలి. వాటి కోసం కొంత సమయం కేటాయించాలి. అలా జీవించిన వారే సవ్యంగా జీవించినవారవుతారు. లేకపోతే ఈ జీవితం బాగుండవచ్చు, వైభవంగా గడపవచ్చు, కాని తరువాత జీవితం దుర్భరమవుతుంది. బాధపడినా, రోదించినా ప్రయోజనముండదు.

అలాగే గతంలో ఆలోచించకుండా జీవించి, ప్రస్తుతం దుర్భర జీవితాన్ని అంటే ముష్టివాళ్ళుగా, కుష్టురోగులుగా, అంగవైకల్యంతో, కష్టాలతో, బాధలతో, జీవిస్తున్న వారు ఎంతోమంది వున్నారు. వారంతా 'ఏనాడు చేసుకున్న పాపమో!' అని బాధపడుతూ, జీవిస్తున్నారు. వారంతా ప్రస్తుతం ఇన్ని బాధలు ఎందుకు అనుభవిస్తున్నారంటే! గతంలో ప్రస్తుత జీవితం గురించి ఆలోచించకపోవడం వల్లనే! ప్రస్తుత జీవితం గురించి ఏమీ చేసుకోకపోవడమే. అందుచేత మరణానంతర జీవితం గురించి కచ్చితంగా ఆలోచించాలి. అది కూడా నా జీవితమేనని తెలుసుకోవాలి.

మరి మరణానంతర జీవితం గురించి ఏం చెయ్యాలి? మరణా నంతర జీవితాన్ని ఆనందమయం చేసుకునే సాధనే 'ధ్యానం'. ధ్యానం ఎవరైతే చేస్తారో, వారు ఈ జీవితంలోనే కాదు, మరణానంతర జీవితంలో కూడా ఆనందంగా జీవించగలుగుతారు. అందుచేత కొంత సమయాన్ని 'ధ్యానానికి' కేటాయించాలి.

ఆలోచిస్తే ప్రస్తుతం వున్న జీవితం స్వల్పం. మరణానంతర జీవితం అనంతం. తెలివైనవాడు అంతం లేని జీవితానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తాడు, ఎక్కువ సమయం కేటాయిస్తాడు. స్వల్పజీవితానికి తక్కువ సమయం కేటాయిస్తాడు. అందుచేత మరణానంతర జీవితానికి సంబంధించిన ధ్యాన సాధనకు ఎక్కువ సమయం కేటాయిద్దాం.

యోగులు ఈ రహస్యం తెలుసుకున్నారు కాబట్టే వారు ఉన్న జీవితానికి ప్రాముఖ్యం ఇవ్వలేదు. వారి జీవితమంతా ధ్యానానికి ప్రాముఖ్యం ఇచ్చారు వారు భోగాలకు ప్రాముఖ్యం ఇవ్వకుండా, శారీరిక అవసరాలకు మాత్రం పరిమితమై తక్కిన జీవితమంతా ధ్యాన సాధనకు కేటాయించి ధన్యులైనారు; అందుచేత ప్రతీ ఒక్కరికి మరణానంతర జీవితం వుందని తెలుసుకోవాలి. 'ధ్యానసాధన' చెయ్యాలి.



# "అధర్మం - ధర్మం - సత్యం"
# ''0 - 50 - 100''

మనం **అధర్మంలో** జీవిస్తే
మన యొక్క మార్కులు **"సున్న"**

**"అధర్మంలో జీవించటం"** అంటే **"హింసలో జీవించడం":**

అంటే, తోణి ప్రాణుల భౌతిక కాయాల పట్ల ఘాతక హింసలకు పాల్పడడం
అంటే, ఆహారం కోసం జంతువులనూ, పక్షులనూ, చేపలనూ చంపి వాటి మాంసాన్ని
వండుకుని తినటం అంటే, కక్ష కోసం మనుష్యులను చంపటం
అంటే, భరించలేని పరిస్థితులలో ఆత్మస్థైర్యం కోల్పోయి ఆత్మహత్యకు పాల్పడడం
అయితే, ఎలాంటి పరిస్థితులలో అయినా సరే ...
**ఆత్మహత్య** చేసుకోవటం అన్నది మాత్రం పూర్ణంగా **అధర్మయుతమైన చర్య**
శాకాహారి కాకపోయినప్పుడు, హింసావాది అయినప్పుడు
ఎంతటి ప్రాపంచిక పండితుడికి అయినా సరే వచ్చే మార్కులు "సున్న"

**అధర్మంలో** జీవిస్తే మనకు వచ్చే మార్కులు "సున్న" ..
**ధర్మం**తో జీవిస్తే మనకు వచ్చే మార్కులు "యాభై" ..

**"ధర్మంలో జీవించటం"** అంటే **"అహింసలో జీవించటం" :**

అంటే, తోటి ప్రాణుల భౌతిక కాయాల పట్ల ఏ ఘాతకాలూ చేయకపోవడం
అంటే, ఆహారం కోసం జంతువులనూ, పక్షులనూ, చేపలనూ చంపకుండా ఉండటం
అంటే, ఏ కక్షల కారణంగానైనా మనుష్యులను చంపకపోవటం
అంటే, భరించలేని దీన పరిస్థితులలో సైతం ఆత్మహత్య చేసుకోకపోవటం
అయితే, విధిలేని పరిస్థితులలో...
**"స్వీయప్రాణరక్షణ"** కోసం అయితే చంపటం అన్నది కూడా **ధర్మయుతమైన చర్య**
అయినదే;
**"స్వీయ ప్రాణరక్షణ"** కోసం క్రూర జంతువులను చంపటమో
లేక మనుష్యులను చంపటమో అన్నది ఎంతమాత్రం అధర్మం కాజాలదు;
అది "ఆపద్ధర్మం" అవుతుంది.

**"స్వీయప్రాణరక్షణ"** కోసం చంపటం **ధర్మయుతమైన చర్య** అయినదే కనుక
అక్కడ "యాభై మార్కులు" ఖచ్చితంగా వచ్చి తీరుతాయి.
అయితే జీవితంలో "వంద మార్కులు" రావాలంటే ...
"అహం బ్రహ్మాస్మి" అనే సత్యం అర్థం కావాలి
"మనం భువికి దిగి వచ్చిన ఆత్మసత్య దేవుళ్ళం" అన్న **సత్యం** తెలుసుకుని తీరాలి.
"మన ఆత్మ అనంతం, శాశ్వతం అయినది " అన్న **సత్యం** తెలుసుకుని తీరాలి
మన "ఆత్మ యొక్క **సమయ పరిధి రాహిత్యం**" మరి**"వ్యాప్తి పరిధి రాహిత్యం"** అన్నవి
అర్థం అయినపుడు **"తెలిసీ తెలియని ఆత్మదేవుళ్ళం"** అయిన మనం
**"ఆత్మ సాక్షాత్కారం పొందిన ఆత్మ సత్యదేవుళ్ళం"** గా మారుతాం
అంతేకాకుండా..
"మన జీవిత వాస్తవాలకు .. జన్మకు పూర్వం మరి జన్మ తరువాత .. మనం స్వయంగా
ప్రణాళికా బద్ధంగా సంకల్పించిన ఎంపికలే కారణభూతాలు"
అన్న **సత్యం** కూడా తెలుసుకోవాలి
అదనంగా
"ఆనాపానసతి – శ్వాసానుసంధానం ద్వారానే ధ్యాన–సమాధి స్థితి లభ్యం"
అన్న <u>సత్యం</u> కూడా అనుభవపూర్వకంగా తెలియాలి :
అప్పుడే జీవితంలో "వంద మార్కులు" వస్తాయి


" సున్న మార్కులు " = అధర్మం + అసత్యం
" యాభై మార్కులు " = ధర్మం + అసత్యం
" వందమార్కులు " = ధర్మం + సత్యం

వంద మార్కుల స్థితిలో :

- హింస అన్నది కలలో కూడా తలపెట్టం
- "మనం దివి నుంచి భువికి దిగివచ్చిన **ఆత్మసత్యదేవుళ్ళం**" అని పూర్తిగా అర్థం అవుతుంది
- "మన వాస్తవాలకు నూటికి నూరు శాతం పూర్వ స్వీయ ఎంపికలే కారణభూతాలు" అని తెలుస్తుంది.
- "ఆనాపానసతి ధ్యానం" అత్యంత సంతోషదాయకమైన దైనందిన అలవాటుగా ఉంటుంది.

**ఇదే "అధర్మం – ధర్మం – సత్యం" అన్న విషయాల పట్ల మౌలిక ప్రవచనం !**
**ఇదే "సున్న – యాభై – వంద" అన్న పిరమిడ్ ఫిలాసఫీ కాన్సెప్ట్!**

**– బ్రహ్మర్షి పత్రీజీ**




# "అంతా సత్యమే"

అనాదిగా **"చార్వాక సిద్ధాంతం" ..**
అదే అప్పటి కమ్యూనిస్టు వారి **"నాస్తిక పరిభాష"..**
మరి "హేతు వాదం"..
**"జగత్ సత్యం .. బ్రహ్మ మిధ్య .. జీవో జగదైవ నా పరః"** అంటోంది.
అంటే "ఈ కంటికి కనపడే జగత్తే సత్యం ...
ఈ చర్మచక్షువులకు కనపడనిది ఇంకా ఏదో ఉంది అనుకోవడం భ్రమ ..
**'జీవుడు'** అంటే ఈ కంటికి కనపడే భౌతిక శరీరమే కానీ .. అంతకంటే ఏమీ కాదు; చనిపోయిన తర్వాత శరీరం నుంచి విడివడే **'ఆత్మ పదార్థం'** ఏదీ లేదు" అన్నది వారి భావన అయితే దీనికి భిన్నంగా **ఆస్తిక వాదులు** అనాదిగా నొక్కివక్కాణిస్తున్న సూత్రం..
**"జగత్ మిధ్య .. బ్రహ్మ సత్యం .. జీవో బ్రహ్మైవ నా పరః"**
అంటే .. "ఈ కంటికి కనపడే జగత్తే ఏ అస్తిత్వం లేనిది ..
కంటికి కనపడని అస్తిత్వమే నిజమైన చైతన్యం కలిగి ఉన్నది
**'జీవుడు'** అంటే కేవలం భౌతిక పదార్థం మాత్రమే కాదు ..
**'జీవుడు'** అంటే ఆ బ్రహ్మమే .. మరి ఆ సృష్టి వ్యాప్త ఆత్మపదార్థమే "
"భౌతికకాయం చనిపోయిన తరువాత ఆత్మ అన్నది నిలిచే వుంటుంది" అన్నదే **"ఆస్తిక పరిభాష"**
దీనికి కూడా ప్రత్యామ్నాయంగా మరొక పరిభాష కూడా ఉంది మరి అదే **"బౌద్ధిక పరిభాష"**
**బౌద్ధిక పరిభాష .. "జగత్ శూన్యం .. బ్రహ్మ శూన్యం .. జీవో శూన్యైవ నా పరః"** అంటోంది
అంటే .. "ఈ జగత్తు అంతా శూన్యమే .. బ్రహ్మ కూడా శూన్యమే
మరి అందులో వున్న **'జీవుడు'** కూడా మహాశూన్యమే .. అంతేకానీ.. వేరు ఏదీ కాదు" అని
ఈ మూడు భిన్న విభిన్న దృక్పథాలు ఎన్నో రకాలుగా ఎంతోమందికి ఉపయోగపడ్డాయి..
ఎంతో మందిని శాంతపరచాయి .. మరెంతో మందిని కల్లోల పరచాయి కూడా
అయితే .. అసలు సిసలైన **"పిరమిడ్ సిద్ధాంతం"** మాత్రం
**"జగత్ సత్యం .. బ్రహ్మ సత్యం .. జీవో ద్వయమపి నా పరః"** అంటోంది.
అంటే .. "శరీరంతో పాటు ఈ కంటికి కనపడే జగత్తు.
కంటికి కనపడని చైతన్యం మరి అనేకానేక లోకాలు కూడా సత్యమే...
అసలు ఈ **'జీవుడు' ..** ఏక కాలంలో .. రెండూనూ "


**– బ్రహ్మర్షి పత్రీజీ**

# "భక్త్యోపనిషత్"



భక్తి చాలా గొప్పది
మన శరీర ఆరోగ్యం పట్ల మనం భక్తిని కలిగి వుండాలి
మన మనో రంజనం పట్ల మనం భక్తిని కలిగి వుండాలి
మన బుద్ధి వికాసం పట్ల మనం భక్తిని కలిగి వుండాలి
మన నిరంతర ధ్యానాభ్యాసం పట్ల మనం భక్తిని కలిగి వుండాలి
మన ఆత్మానుభవాల పట్ల మనం భక్తిని కలిగి వుండాలి
మన వర్తమాన ఎరుక పట్ల మనం భక్తిని కలిగి వుండాలి
యమ నియమాదులన్నింటి పట్ల మనం భక్తిని కలిగి వుండాలి
మన రోజువారీ దైనందిన కుటుంబ కర్తవ్య కార్యక్రమాల పట్ల
మనం భక్తిని కలిగి వుండాలి
సకల విద్యల పట్ల, సకళ కళల పట్ల మనం భక్తిని కలిగి వుండాలి
సృష్టి యొక్క అద్భుత రచన పట్ల మనం భక్తిని కలిగి వుండాలి
విశ్వంలో వున్న యోగీశ్వరులందరి పట్ల మనం భక్తిని కలిగి వుండాలి
తోటి మానవుల పట్ల మనం భక్తిని కలిగి వుండాలి
అందరి ఆరోగ్యాల పట్ల మనం భక్తిని కలిగి వుండాలి
సకల జంతు సామ్రాజ్యం యొక్క రక్షణ, పోషణల పట్ల భక్తిని కలిగి వుండాలి
భూ ప్రకృతి సమస్తం పట్ల భక్తి భావన కలిగి వుండాలి
వాతావరణాన్ని కలుషితం చేయరాదు
వాతావరణ సహజ స్థితులను పరిరక్షించుకుంటూ వుండాలి.
ఇతి భక్తి యోగః! ఇతి భక్తి సిద్ధాంతః।
భక్తి చాలా గొప్పది! భక్తిని కలిగి వుందాం!!

**– బ్రహ్మర్షి పత్రీజీ**



# మూడు సత్యాలు

**"మనం కోరుకున్నది మనకు లభించదు ...**
**మనకు అర్హమైనదే మనకు లభిస్తుంది".**

వేటినైతే మనం ఆశిస్తూ, కోరుకుంటూ ఉంటామో అవన్నీ మనవి అయిపోవడం లేదు ! వాస్తవానికి వేటిని పొందడానికైతే మనకు అర్హత వుంటుందో వాటిని మాత్రమే పొందుతున్నాం!

ఇంకొంచెం ముందుకు పోయి ... ఇంకొంచెం లోతైన రెండవ సత్యాన్ని తెలుసుకుందాం :

---

**"అర్హమైనవి దక్కక పోవచ్చు గానీ ..**
**మన నిజమైన అవసరాలు మాత్రం తప్పకుండా తీరుతాయి ".**

"నేను ... అంటే ఈ కనిపించే భౌతిక శరీరం మాత్రమే" అనిపించే భ్రమ నుంచి "నేను అంటే ఈ దృశ్య ప్రపంచానికి ఆధారమైన ఆత్మ స్వరూపాన్ని" అన్న అవగాహన వచ్చిన తర్వాత ఆత్మ పరిణితిని మించిన శ్రేయస్సు ఇంకేముంటుంది?! కనుక, అప్పటి నుంచి, వర్తమాన ఆధ్యాత్మిక జీవితానికి అంతగా ఉపయోగించని భౌతిక జీవిత కోరికలు మనకు తీరవు! కేవలం, ఏవేవి లభిస్తే మన 'ఆధ్యాత్మిక ఎదుగుదల' మరింత ఎక్కువగా సాధ్యపడుతుందో, అటువంటివి మాత్రమే మనవి అవుతాయి!

ఇంకా ముందుకు పోయి అత్యంత లోతైన మూడో సత్య సిద్ధాంతాన్ని చూద్దాం!

---

**"మన అవసరాలు తీరక పోవచ్చు గానీ... మన ద్వారా సమాజ ప్రగతికి అవసరాలేవైతే వున్నాయో అవి మటుకు మనకు తప్పకుండా లభిస్తాయి".**

ఒక ధ్యానిగా, ఒక యోగిగా తన జీవిత వైచిత్రాన్ని అంతరంగంలో వీక్షించుకున్న ఒకానొక ఆత్మజ్ఞానికి, ఏ భౌతిక, ఆధ్యాత్మిక అవసరాలైనా ప్రత్యేకించి ఏముంటాయి? తనలోని బ్రహ్మ పదార్థమే సకల జీవరాశిలోనూ స్థితమై భాసిల్లుతోందని గ్రహించిన బ్రహ్మజ్ఞానికి స్వంత పరిణితి అంటూ విడిగా ఏముంటుంది?!

కనుక తన వాతావరణాన్ని, సమాజాన్ని అన్ని విధాలా ఉద్ధరించే కార్యక్రమంలో అతడు అంకిత భావంతో మునిగి వుంటూ "నా ద్వారా ఏం జరిగితే అది సమాజ ప్రగతికి తోడ్పడుతుందో అవి మాత్రమే నాకు లభిస్తూంటాయి" అన్న సత్‌స్ఫూర్తి కలిగి వుంటాడు.

**– బ్రహ్మర్షి పత్రీజీ**

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

| | | | |
|---|---|---|---|
| 1) జీవితశాస్త్రం (మొదటిభాగం)- | రూ.100/- | 22) త్రివిధాలు - | రూ.60/- |
| 2) జీవితశాస్త్రం (రెండవభాగం)- | రూ.130/- | 23) ధ్యానం (పత్రీజీ) - | రూ.50/- |
| 3) జీవిత సత్యాలు - | రూ.100/- | 24) ధ్యానం వల్లనే జ్ఞానం - | రూ.60/- |
| 4) భగవంతుడంటే - | రూ.130/- | 25) అతీంద్రియ శక్తులు - | రూ.60/- |
| 5) సత్యమార్గం - | రూ.130/- | 26) శాస్త్రాల అర్థం- అంతరార్థం - | రూ.60/- |
| 6) ఆత్మ శాస్త్రం - | రూ.100/- | 27) ఆశ్చర్యం... ఆశ్చర్యం - | రూ.60/- |
| 7) ధ్యాన శాస్త్రం - | రూ.100/- | 28) విద్యార్థుల వికాసానికి | |
| 8) జ్ఞానరసగుళికలు (పత్రీజీ) - | రూ.100/- | ధ్యాన విద్య - | రూ.50/- |
| 9) పరమగురువుల | | 29) మౌన ధ్యానం - | రూ.40/- |
| ప్రబోధాలు (పత్రీజీ) - | రూ.100/- | 30) ఈ జీవితం ఎందుకు? - | రూ.50/- |
| 10) భగవద్గీతా సారం - | | 31) నిర్వాణ మార్గం - | రూ.50/- |
| శ్రీ కృష్ణ సందేశం - | రూ.130/- | 32)షిరిడీసాయి సందేశాలు - | రూ.40/- |
| 11) ధ్యాన శక్తి - | రూ.100/- | 33) భాగవత సన్నివేశాల | |
| 12) తెలుసుకోండి - | రూ.120/- | అంతరార్థం - | రూ.40/- |
| 13) జీవిత సూక్ష్మాలు - | రూ.120/- | 34) భూతదయే దైవత్వం - | రూ.40/- |
| 14) గీతాసందేశం - | రూ.100/- | 35) ఆలోచించండి - | రూ.60/- |
| 15) కర్మ సిద్ధాంతం - | రూ.80/- | 36) సంకల్పమంటే? - | రూ.50/- |
| 16) బ్రహ్మజ్ఞానం - | రూ.60/- | 37) మరోజన్మ (తటవర్తి రాజ్యలక్ష్మి) - | రూ.30/- |
| 17) ఆత్మజ్ఞానం ఎందుకు? - | రూ.70/- | 38)మనం ఇహలోకవాసులమా? | |
| 18) ధ్యానమంటే ? - | రూ.50/- | పరలోకవాసులమా? - | రూ.20/- |
| 19) జ్ఞాన జ్యోతి - | రూ.70/- | 39) శాకాహారమే మానవాహారం - | రూ.15/- |
| 20) జ్ఞాన కుసుమాలు - | రూ.70/- | 40) అహింస మరియు | |
| 21) దుఃఖ నివారణామార్గం- | రూ.60/- | శాఖాహారం - | రూ.15/- |

పుస్తకముల కొరకు :

**తటవర్తి వీర రాఘవరావు,**

తటవర్తి వారి వీధి, భీమవరం-534 201. (ప॥గో॥జిల్లా.)

ఫోన్ : 9490171853, సెల్ : 9440309812



లోకంలో మానవులను గమనిస్తే ఇంచుమించు ఎవరు ఏ పని చేసినా మూడే కారణాలు కనిపిస్తాయి. (1) పూర్వం నుంచి , తరతరాల నుంచి ఆచారంగా వస్తుందని చేస్తున్నారు. (2) అందరూ చేస్తున్నారని చేస్తున్నారు. (3) ఎవరో చెప్పారని చేస్తున్నారు. అంతే కాని ఎవరూ ఆలోచించి చెయ్యటం లేదు. ఇది ఎవరికి వారు గమనిస్తే తెలుస్తుంది.

ఏ రకంగా చూసినా మానవులు ఇతరులను అనుకరిస్తున్నారు. అంతేకాని ఎవరూ తాము చేయవలసిన పనులు, తాము చేసే పనులు గురించి ఆలోచించడం లేదు. మానవుని దుఃఖానికి కారణం ఇదే.

మానవులు ఆలోచించవలసిన విషయాలు కొన్ని ఈ పుస్తకం ద్వారా ఇవ్వడం జరిగింది. అవి చదివి వాటి గురించి ఆలోచించండి. జీవితాన్ని ఆనందంగా మార్చుకోండి.

రూ.60/-

మీ...

**తటవర్తి వీరరాఘవరావు**